

యంత్రాలతో వరి నూర్పులు

- జిల్లాలో పెరుగుతున్న యాంత్రీకరణ
- సమయం, కూలి ఖర్చులు ఆదా
- కంబైన్ హార్వెస్టర్‌తో మరింత మేలంటున్న ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త

-8లో

పాల సేకరణలో కోత

- రైతుల నుంచి పది శాతం మేర తగ్గించి తీసుకుంటున్న విశాఖ డెయిరీ సిబ్బంది
- లేదంటే వారానికి ఒక రోజు పాల కేంద్రం మూసివేత
- సొసైటీలకు ఇటీవల ఉత్తర్వులు జారీ
- మిగిలిన పాలను ఏం చేయాలని ప్రశ్నిస్తున్న రైతులు
- డెయిరీ యాజమాన్య తీరుపై ఆగ్రహం



విశాఖ డెయిరీకి పాలు పోస్తున్న రైతులు

చోడవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):

పాల ఉత్పత్తిదారులపై విశాఖ డెయిరీ ఆంక్షల కత్తి ఝుళిపిస్తున్నది. ఇప్పటికే ఆవు పాల సేకరణ ధరను తగ్గించిన విశాఖ డెయిరీ యాజమాన్యం, తాజాగా పాల సేకరణను కుదించింది. రైతులు తీసుకువచ్చే పాలలో 90 శాతం మాత్రమే సేకరించాలని సిబ్బందిని ఆదేశించింది. లేదంటూ వారంలో ఒక రోజు పాల సేకరణ ఆపేయాలని స్పష్టం చేసింది. విశాఖ డెయిరీ యాజమాన్య తీరుపై రైతులు భగ్గుమంటున్నారు.

విశాఖ డెయిరీ యాజమాన్యం గత ఏడాది అక్టోబరు నుంచి ఆవు పాల సేకరణ ధరను లీటరుకు దాదాపు నాలుగు రూపాయలు తగ్గించిన విషయం తెలిసిందే. దీంతో ఆవుల పోషణ గిట్టుబాటుకాని పరిస్థితి నెలకొంది. డెయిరీ యాజమాన్యం తీరును నిరసిస్తూ పాల ఉత్పత్తిదారులు ఆయా కేంద్రాల వల్ల ఆందోళనలు చేశారు. అయినప్పటికీ పాత ధరను పునరుద్ధరించలేదు. తాజాగా పాల సేకరణకు కూడా పరిమితులు విధించింది. గత మూడు రోజులుగా పాల కేంద్రాల్లో సిబ్బంది ఆయా రైతులు తీసుకువచ్చే పాలలో లీటరుకు వంద మిల్లీలీటర్ల తగ్గించి తీసుకుంటున్నారు. ఐదు లీటర్ల పాలు తెచ్చిన రైతు నుంచి నాలుగున్నర లీటర్లు మాత్రమే తీసుకుని, మిగిలిన అర లీటరు పాలను వెనక్కు ఇచ్చేస్తున్నారు. ఇదేమిటని రైతులు ప్రశ్నించగా.. పాల మార్కెటింగ్‌లో నెలకొన్న ఇబ్బందుల దృష్ట్యా పాల సేకరణ తగ్గించాలని, లేకపోతే వారంలో ఒక రోజు పాల కేంద్రాన్ని మూసివేయాలని నాలుగు రోజుల క్రితం డెయిరీ నుంచి సర్క్యులర్ వచ్చిందని సిబ్బంది చెబుతున్నారు. పాల సేకరణలో కోత విధిస్తే.. మిగిలిన పాలను తాము ఎక్కడ అమ్ముకోవాలని రైతులు ఆవేదనతో ప్రశ్నిస్తున్నారు. రెండు ఆవులు వున్న రైతులు రోజూ డెయిరీకి 20 లీటర్లకు

... మిగతా 8వ పేజీలో

విశాఖ డెయిరీని నమ్ముకున్నందుకా..?

- జనపరెడ్డి జగ్గారావు, నరసయ్యపేట, చోడవరం మండలం



ఇంతకాలం ప్రైవేటు డెయిరీలకు పాలు పోయకుండా విశాఖ డెయిరీనే నమ్ముకున్నందుకు మాకు బాగానే గుణపాఠం చెబుతున్నారు. ఇప్పటికే ఆవు పాల ధరను 15 శాతానికిపైగా తగించారు. ఇప్పుడు లీటరుకు వంద ఎం.ఎల్. తగ్గించి తీసుకుంటున్నారు. మిగిలిన పాలను ఏం చేయాలో డెయిరే యాజమాన్యమే చెప్పాలి.

నేడు అనకాపల్లిలో 'ఆంధ్రజ్యోతి' చర్చా వేదిక

- అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా కార్యక్రమం

సమయం: ఉదయం 10 గంటలు

వేదిక: రామాలయం కల్యాణమండపం, కొట్నీ వీధి



అనకాపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):

ప్రజాప్రతినిధులు, అధికారులను ఒకే వేదిక మీదకు తీసుకొచ్చి వారి సమక్షంలో ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలను చర్చించి, పరిష్కరించే లక్ష్యంతో 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో 'అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా' పేరుతో అనకాపల్లిలో మంగళవారం చర్చా వేదిక జరగనున్నది. జీవీఎంసీ పరిధిలోని 84వ వార్డులో కొట్నీవీధి, లక్ష్మీనారాయణనగర్‌లో స్థానికులు ఎదుర్కొంటున్నా సామాజిక సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై కొట్నీవీధి రామాలయం కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు చర్చా వేదిక ప్రారంభం అవుతుంది. స్థానికులు, ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరై ప్రజల సమస్యలను వివరిస్తారు. వీటిని అధికారులు, ప్రజాప్రతినిధులు పరిష్కరించే విధంగా 'ఆంధ్రజ్యోతి' కృషి చేయనున్నది. ఈ చర్చా వేదికకు ముఖ్య అతిథులుగా అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, 84వ వారు కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి హాజరు కానున్నారు. అనకాపల్లి తహసీల్దారు విజయకుమార్, జీవీఎంసీ ఈఈ శేఖర్, శానిటేషన్ సూపర్‌వైజర్ ఆర్.రవికుమార్, మెప్మా ఏపీడీ వై.సంతోష్‌కుమార్, పట్టణ పోలీసు స్టేషన్ సీఐ టీవీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొంటారు.

చేసిన మంచిని ప్రజలకు చెప్పండి

- ఉత్తరాంధ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిని ఇంటింటికీ వెళ్లి వివరించాలి
- నేతలకు మంత్రి నారా లోకేశ్ పిలుపు



విశాఖలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్, పాల్గొన్న ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర అభివృద్ధికి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని ఇంటింటికీ వెళ్లి వివరించాలని పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులకు రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు.

- ఏడు నెలల్లో రైల్వే జోన్, విశాఖ ఉక్కు కర్మాగారం సమస్యల పరిష్కారం
- అనేక ఐటీ కంపెనీలను, పరిశ్రమలను తీసుకువస్తున్నాం
- క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీలను బలోపేతం చేయడంపై నేతలు దృష్టిసారించాలి
- కార్యకర్తలకు అన్నివిధాలా అండగా నిలవండి

ఉత్తరాంధ్ర ప్రజా ప్రతినిధులతో సమీక్ష

సోమవారం నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఉత్తరాంధ్రకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. పార్టీ బలోపేతం కోసం తీసుకోవలసిన చర్యలు, సంస్థాగత అంశాలపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీలను బలోపేతం చేయడంపై నేతలు దృష్టిసారించాలన్నారు. పార్టీ కార్యకర్తలకు అన్నివిధాలా అండగా నిలవాలన్నారు. పార్టీయే సుప్రీం అని, దానివల్లే ఈ స్థాయిలో ఉన్నామనే విషయాన్ని నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. పార్టీ వల్లనే తాను యువగళం పాదయాత్ర చేయగలిగానన్నారు. రాష్ట్రానికి ప్రధాని నరేంద్రమోదీ సహకరిస్తున్నారని, ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. అధికారంలో ఉన్నా, విపక్షంలో ఉన్నా మనలో కసి ఉండాలని, ప్రతి అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలన్నారు. రైల్వే జోన్, విశాఖ ఉక్కు కర్మాగారం సమస్యలను ఏడు నెలల్లో పరిష్కరించామని, ఉత్తరాంధ్ర ప్రాంతానికి అనేక ఐటీ కంపెనీలను, పరిశ్రమలను తీసుకువస్తున్నామన్నారు. కోటికిపైగా సభ్యత్వ నమోదుతో ఇప్పటికే పార్టీ చరిత్ర సృష్టించిందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, వెలగపూడి రామకృష్ణబాబు, అదితి గజపతి, వంశీకృష్ణ శ్రీనివాస్, విశాఖ, విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గాల అధ్యక్షులు గండి బాబ్జీ, కిమిడి నాగార్జున, జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ దొన్నుదొర, హౌసింగ్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, నాయకులు సీతంరాజు సుధాకర్, కోరాడ రాజబాబు, పీవీఎస్ఎన్ రాజు,చింతకాయల విజయ్, పీలా శ్రీనివాస్, దాడి రత్నాకర్ పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

- 22 మందికి గాయాలు
- ముగ్గురి పరిస్థితి ఆందోళనకరం
- నర్సీపట్నం ఆస్పత్రికి తరలింపు



పిచ్చికుక్క దాడిలో గాయపడిన వారికి వైద్యం చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది.

రావికమతం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):

మండలం కేంద్రంలో సోమవారం రాత్రి పిచ్చికుక్క ఒకటి స్వైరవిహారం చేసింది. కనిపించిన వారిందరిపైనా దాడి చేసి ఎడాపెడా కరిచేసింది. దీంతో 22 మంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా వుండడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రావికమతం, మేడివాడ, గర్నికం, పెద పాచిల, మరుపాక, బుచ్చెయ్యపేట మండలం బుదిరెడ్లపాలెం, తదితర గ్రామాల

... మిగతా 8వ పేజీలో

కాలుష్య కోరల్లో మామిడిపాలెం

రాయి క్వారీలు, స్టోన్ క్రషర్లతో ఎగిసిపడుతున్న దుమ్ము, ధూళి

- కిడ్నీ, శ్వాసకోశ వ్యాధులబారిన గ్రామస్థులు
- నాలుగేళ్లలో 25 మంది మృత్యువాత
- 1,421 మందికి వైద్య పరీక్షలు.. 300 మంది కిడ్నీ వ్యాధి బాధితులు
- క్వారీలు, క్రషర్లపై చర్యలు తీసుకోని అధికారులు



క్వారీలో బ్లాస్టింగ్‌తో ఎగిసిపడుతున్న ధూళి

తుమ్మపాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి మండలం మామిడిపాలెం గ్రామానికి సమీపంలోని రాయి క్వారీలు, స్టోన్ క్రషర్ల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో ప్రజలు పెద్ద సంఖ్యలో కిడ్నీ, శ్వాసకోశ సంబంధ వ్యాధులబారిన పడుతున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించి ఏటా పలువురు మృత్యువాత పడుతున్నారు. మామిడిపాలెం పంచాయతీలో సుమారు మూడు వేల మంది జనాభా నివసిస్తున్నారు. ఈ రెవెన్యూ పరిధిలో ఐదు రాయి క్వారీలు, రెండు స్టోన్ క్రషర్లు వున్నాయి. పక్కనే వున్న బవులవాడ పంచాయతీలో మామిడిపాలెం మెయిన్‌రోడ్డును ఆనుకొని అల్లిఖానుడుపాలెం, దర్జీనగర్, బవులవాడ గ్రామాల్లో మరికొన్ని క్వారీలు, క్రషర్లు వున్నాయి. క్వారీల్లో రాయి తీత కోసం భారీ ఎత్తున పేలుళ్ల

... మిగతా 8వ పేజీలో



కిడ్నీ వ్యాధితో మంచాన పడ్డ జెర్రిపోతుల శ్రీను

రోజులు లెక్క పెడుతున్నాను..

- పూడి సంతోష్, మామిడిపాలెం



కిడ్నీ వ్యాధిబారిన పడి నరకయాతన అనుభవిస్తున్నాను. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండడంతో పూర్తి స్థాయిలో వైద్యం చేయించుకోలేకపోతున్నాను. నా మీద కుటుంబం ఆధారపడి ఉన్నప్పటికీ ఏమీ చేయలేని పరిస్థితుల్లో రోజులు లెక్క పెడుతున్నాను. అధికారులు ఇప్పటికైనా స్పందించి క్వారీలు, క్రషర్ల కాలుష్యం నుంచి గ్రామస్థులను రక్షించాలి.

రికార్డు స్థాయిలో బెల్లం లావాదేవీలు

15,776 దిమ్మలు విక్రయం

- ప్రస్తుత సీజన్‌లో ఇవే అత్యధికం
- పండుగ ముందు ధరలతో పోలిస్తే 20 శాతం వరకు తగ్గుదల



మార్కెట్ యార్డులో ప్లాట్‌ఫారంపై బెల్లం దిమ్మలు

అనకాపల్లి టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):

స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో సోమవారం రికార్డుస్థాయిలో బెల్లం లావాదేవీలు జరిగాయి. వివిధ గ్రామాల నుంచి రైతులు 15,776 బెల్లం దిమ్మలు తీసుకువచ్చి విక్రయించారు. ఇంత పెద్ద మొత్తంలో బెల్లం లావాదేవీలు జరగడం ప్రస్తుత సీజన్‌లో ఇదే ప్రథమం అని మార్కెట్ యార్డు అధికారులు తెలిపారు. ఇంతకు ముందు ఈ నెల ఆరో తేదీన అత్యధికంగా 9,630 బెల్లం దిమ్మలకు లావాదేవీలు జరిగాయి. అయితే ఆ రోజుతో పోలిస్తే సోమవారం బెల్లం ధరలు బాగా తగ్గాయి. ఈ నెల ఆరో తేదీన ఒకటో రకం వంద కిలోలు రూ.5,100లు, రెండో రకం రూ.4,400లు, మూడో రకం రూ.3,260 ధరలు పలికాయి. సోమవారం ఇవే రకాలు వరుసగా రూ.4,090, రూ.3,710, రూ.3,170 మాత్రమే పలికాయి. జనవరి మొదటి వారం ధరలతో పోల్చితే ఒకటో రకం రూ.910, రెండో రకం రూ.690, మూడో రకం రూ.90 తగ్గాయి. దీంతో ఒకటి, రెండు రకాల బెల్లం విక్రయించిన రైతులు నిరాశ చెందారు. అయితే ఈ నెల మొదటి వారంలో సంక్రాంతి పండుగ కారణంగా ఏపీతోపాటు ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి బెల్లానికి డిమాండ్ వుండడంతో ధరలు పెరిగాయని, ప్రస్తుతం ఒడిశా తప్ప ఇతర ప్రాంతాల నుంచి డిమాండ్ లేదని వర్తకులు చెబుతున్నారు. మార్కెట్ యార్డుకు వస్తు బెల్లంలో 30 శాతం వరకు ఒడిశాకు ఎగుమతి చేస్తుండగా, మిగిలిన సరకును శీతల గిడ్డంగుల్లో నిల్వ చేస్తున్నారు.



కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహారదీక్ష చేస్తున్న వీవోఏలు

వీవోఏలు రిలే నిరాహారదీక్ష

- వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్
- మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని వినతి

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):

ఆరు నెలల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని, మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వెలుగు వీవోఏలు (యానిమేటర్లు) సోమవారం కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీ వెలుగు వీవోఏల సంఘం (సీఐటీయూ అనుబంధ) రాష్ట్ర అధ్యక్షురాలు

... మిగతా 8వ పేజీలో

పర్యాటక హబ్‌గా విశాఖ

- విశాఖను క్రూయిజ్ కేంద్రంగా మారుస్తాం
- పర్యాటక రంగాన్ని పీ-4 విధానంలో అభివృద్ధి చేయాలన్నది ముఖ్యమంత్రి ఆకాంక్ష
- ప్రాంతీయ పెట్టుబడిదారుల సదస్సులో పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్
- వాటర్, అడ్వంచర్ స్పోర్ట్స్‌కు సహకారం: స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్
- కోస్తాలో 30 కొత్తగా బీచ్‌లు అభివృద్ధి: ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి



అరకు చలిఉత్సవ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఏపీ టీడీసీ ఎండీ ఆమ్రపాలి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, అల్లూరి జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ తదితరులు. (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



- విశాఖ, కాకినాడ నగరాలను లీజర్ హబ్‌లుగా అభివృద్ధి చేయనున్నట్టు వెల్లడి

- 8వ పేజీలో

అర్హులం.. ఆర్‌ఆర్ ప్యాకేజీని ఇప్పించండి

▸ మూడు గ్రామాల ప్రజల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ప్రజలు

రాంబిల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అర్హులమైన మా కుటుంబాలకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇప్పించాలని మండలంలోని కృష్ణంపాలెం, నారప్పపాలెం, వీఆర్‌అగ్రహారం గ్రామాల వారు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామాల్లో భూములు, ఇళ్లను ఏపీఐఐసీ అధికారులు తీసుకున్నారన్నారు. రెవెన్యూ అధికారులు, ఏపీఐఐసీ అధికారులు కలిసి ఇంటింటా సర్వే చేసి జాబితాలను రూపొందించారన్నారు. ఈ సర్వేలో 36 మందిని అర్హులుగాను, 96 మంది అనర్హులుగా చూపించారన్నారు. తాము ఉంటున్న రేకుల షెడ్లను క్యాటిల్ షెడ్లుగా చూపించి అనర్హులుగా చూపించారని వారు ఆరోపించారు. కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేసి ఆర్‌ఆర్ ప్యాకేజీని ఇప్పించాలని కృష్ణంపాలెం, నారప్పపాలెం, వీఆర్‌అగ్రహారం ప్రజలు కోరుతున్నారు.

జనవాణిలో సుందరపు ఫిర్యాదుల స్వీకరణ



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

అచ్యుతాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో జనసేన ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన జనవాణి కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వాటిని పరిష్కారించేదుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ముగిసిన సహస్ర చండీ మహాయాగం



ముగింపు కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొన్న భక్తులు

ఎస్.రాయవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కొత్త అగ్రహారం రామాలయం వద్ద ఈనెల 16వ తేదీ నుంచి జరుగుతున్న సహస్ర చండీ పూర్వక గాయత్రీ మహాయాగం సోమవారంతో ముగిసింది. పిఠాపురం వాస్తవ్యులు ఇంద్రగంటి నారాయణ సోమయాజులు ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ నుంచి 11 రోజులపాటు నిర్వహించారు. మహా పూర్ణాహుతి అనంతరం పూజా కలశాలను పండితులు వరహానదిలో కలిపారు. సోమవారం శివపార్వతుల శాంతి కల్యాణం జరిపించారు. ఈ కల్యాణానికి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

పల్లెలపై మంచు ముసుగు



అచ్యుతాపురం: హరిపాలెం పరిసర ప్రాంతాల్లో భారీగా కురుస్తున్న మంచు

అచ్యుతాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం తెల్లవారు జాము నుంచి పొంగమంచు దట్టంగా కురిసింది. మండలంలోని హరిపాలెం, తిమ్మరాజుపేట, కొండకర్ల, పెదపాడు, ఎర్రవరం, ఉప్పవరం, మల్లవరం, ఎంజేపురం, జగ్గన్నపేట, ఖాజీపాలెం తదితర ప్రాంతాల్లో పక్కనున్నవారు కనిపించనంతగా మంచు పడింది. దీంతో సోమవారం ఉదయం ఎనిమిది గంటల వరకు రైతులు పొలం పనులకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.

మునగపాకలో..

మండలంలో మంచు విపరీతంగా కురుస్తోంది. ఉదయం పది గంటలైనా సూర్యుడు కనిపించని పరిస్థితి నెలకొంది. రైతులు పొలం పనులకు, కళ్లాలకు పశువుల పాలు తీసేందుకు తెల్లవారుజాము 5 గంటలకే ఇంటి నుంచి బయలుదేరుతారు. రహదారులు దట్టమైన మంచు కారణంగా కనిపించక పోవడంతో రెండు,మూడు రోజులుగా ఆలస్యంగా వెళ్తున్నారు. అనకాపల్లి మార్కెట్ నుంచి కూరగాయలు తెచ్చుకునే వ్యాపారులపై కూడా మంచు ప్రభావం చూపుతోంది. సోమవారం ఉదయం 8 గంటల దాటినా మంచు వీడలేదు.

రూ.4 కోట్ల విలువైన భూములను అమ్మేశారు!

▸ 7.31 ఎకరాల జిరాయితీ భూములకు అక్రమ రిజిస్ట్రేషన్

▸ అధికారులకు బాధిత రైతు కుటుంబీకుల ఫిర్యాదు



నర్సీపట్నం ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

నక్కపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రూ.కోట్ల విలువైన తమ భూములను మరో గ్రామానికి చెందిన వ్యక్తి, తప్పుడు రికార్డులతో మరో వ్యక్తికి విక్రయించేశాడంటూ వేంపాడు గ్రామానికి చెందిన పలువురు ఆవేదన వెలిబుచ్చారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ నర్సింహమూర్తి, సబ్‌రిజిస్ట్రార్ మూర్తి, పోలీసులు, నర్సీపట్నం ఆర్డీవో వీవీవీ రమణలకు సోమవారం బాధితులు ఫిర్యాదు చేశారు. వేంపాడు రెవెన్యూ పరిధి సర్వే నంబరు 276/1లో పూర్వం నుంచి తమకు 7.31 ఎకరాల భూములున్నాయని కళ్లేపల్లి కుటుంబసభ్యులు, వారి వారసులు కళ్లేపల్లి నాగరాజు, రామరాజు, సీతారామరాజు, వేణుగోపాల కృష్ణంరాజు, వెంకటపతిరాజు సోమవారం అధికారులకు తెలిపారు. వీటిని అమలాపురం శివారు మూలపర్ర గ్రామానికి చెందిన వ్యక్తి దొడ్డిదారిన 1బీ రికార్డులు తయారు చేయించుకొని విక్రయించాడని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరారు. సుమారు రూ.4 కోట్లు విలువైన భూములకు 1బీ అడంగళ్లను ఎప్పుడు? ఎవరు ? ఎలా మార్చారో పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. దీనిపై తహసీల్దార్ నర్సింహమూర్తి మాట్లాడుతూ సంబంధిత వ్యక్తులకు నోటీసులిస్తామని, తమ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తామని చెప్పారు. దర్యాప్తులో ఈ భూములు అక్రమ రిజిస్ట్రేషన్ జరిగినట్టు నిరూపితమైతే రిజిస్ట్రేషన్ రద్దుకు సిఫార్సు చేయడమేగాకుండా, క్రిమినల్ కేసులు కూడా పెడతామన్నారు. అనంతరం నక్కపల్లి పోలీసులకు, సబ్‌రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. తదుపరి నర్సీపట్నం ఆర్డీవో వీవీవీ రమణకు కూడా బాధిత రైతులు ఫిర్యాదు చేశారు.

జీవో 13 రద్దు చేయాలని గీత కార్మికుల ధర్నా



ఎలమంచిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గీత కార్మికులు

ఎలమంచిలి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):గీత కార్మికులకు మద్యం దుకాణాలు కేటాయించే జీవో నంబరు 13ను రద్దు చేయాలని సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గీత కార్మిక సహకార సంఘాల ప్రతినిధులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గీత సహకార సంఘాల సమైఖ్య కన్వీనర్ పెంకే మారేసు మాట్లాడుతూ గీత కార్మిక సహకార సంఘాలకు మద్యం దుకాణాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ జీవో కారణంగా మద్యం సిండికేట్లు చొరబడి మద్యం దుకాణాలను బినామీలు పొందుతారన్నారు. అందువల్ల గీత కార్మిక సహకార సొసైటీలకు కేటాయించా లన్నారు. ఎలమంచిలి గీత కార్మిక సహకార సొసైటీ అధ్యక్షుడు దొడ్డి రామకృష్ణ మాట్లాడుతూ మండలంలో గౌడ కులస్తులు లేరని, వారికి మద్యం దుకాణాలు కేటాయించడం విచిత్రంగా ఉందన్నారు. వ్యక్తులకు కాకుండా గీత కార్మిక సహకార సంఘాలకు మాత్రమే దుకాణాలు కేటాయించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు వరహాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పిల్లి శ్రీనివాస్, దొడ్డి వెంకటేష్, దుంగా బంగారి, రంగల నాగరాజు పాల్గొన్నారు.

'పేట' మద్యం షాపు శెట్టిబలిజలకు కేటాయించాలి

పాయకరావుపేట: మండలంలో అధిక సంఖ్యలో ఉన్న శెట్టి బలిజ సామాజిక వర్గానికి మద్యం షాపును కేటాయించాలని మండల కల్లుగీత కార్మిక సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం తహసీల్దారు జి.సత్యనారాయణ, ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావులకు వినతిపత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా సంఘం నాయకులు బత్తిన నాగేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం 10 శాతం మద్యం షాపులు కేటాయించడం అభినందనీయమన్నారు. అయితే మండలంలో 10వేల మంది ఉన్న శెట్టి బలిజ సామాజికవర్గానికి కాకుండా ఒకే కుటుంబం ఉన్న యాత సామాజికవర్గానికి కేటాయించడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలో మద్యం షాపు కేటాయింపు విషయమై పూర్తిస్థాయిలో విచారణచేసి, శెట్టిబలిజ సామాజికవర్గానికి మద్యం షాపు కేటాయించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘాల నాయకులు కర్రి అప్పలకొండ, యాండ్ర బండియ్య, కుందూరు అప్పలకొండ, కక్కల ప్రసాద్, పిట్ల నాగేశ్వరరావు, గుత్తుర్తి రమణ, తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి హైస్కూల్‌ను తనిఖీ చేసిన డిప్యూటీ డీఈవో

రాంబిల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్‌ను జిల్లా ఉపవిద్యాశాఖాధికారి అప్పారావు సోమవారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న కెమిస్ట్రీ ల్యాబ్‌ను పరిశీలించారు. తర్వాత ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈవో ఎం.సూర్యారావు, హైస్కూల్ హెచ్‌ఎం వేణుగోపాల్ ఉన్నారు.

'అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి'

ఎలమంచిలి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలిలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎంపీపీ బోదెపు గోవింద అన్నారు. సోమవారం ఆయన స్థానిక వైసీపీ నేతలతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఘటనపై హోంమంత్రి అనిత స్పందించాలన్నారు. బాలికలకు రక్షణ కల్పించాల్సి బాధ్యత అందరిపైన ఉందన్నారు. ఎలమంచిలి మండలంలో 20 రోజుల వ్యవధిలో మైనర్‌లపై రెండు అత్యాచా రాలు జరిగాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వైసీపీ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, వైసీపీ నేతలు గొర్లె వెంకట్, కౌన్సిలర్లు రాపేటి సంతోష్, పిట్టా సత్తిబాబు, మరిణేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్తమ అధికారులకు సత్కారాలు



ఎంపీడీవో సీతారామరాజును సత్కరిస్తున్న టీడీపీ నేతలు

నక్కపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ఉత్తమ పురస్కారాలు పొందిన నక్కపల్లికి చెందిన అధికారులను సోమవారం టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. రెండోసారి (ఇన్‌చార్జి ఎంపీడీవో) ఏవోగా జిల్లా ఉత్తమ పురస్కారం పొందిన డి.సీతారామరాజు, తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎంఈవో-1 కె.నరేశ్‌లను టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, మాజీ వైస్‌ఎంపీపీ వైబోయిన రమణ, టీడీపీ నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు ఆంజనేయులు సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మేరుగు నాగేశ్వరరావు, దార్ల కృష్ణ, వెలగా శ్రీనివాసరావు, పెదపూడి శంకరరావు, సూరిబాబు పాల్గొన్నారు.

న్యాయ సహాయకుల కోసం దరఖాస్తులు ఆహ్వానం

ఎలమంచిలి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రజలకు న్యాయ సలహాలు అందించేందుకు పారాలీగల్ వలంటీర్లుగా పనిచేయడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షురాలు పి. విజయ కోరారు. జిల్లా జడ్జి ఉత్తర్వుల మేరకు ఈనెల 29వ తేదీలోపు మండల న్యాయ సేవాధికార సంస్థకు దరఖాస్తులు అందజేయాలన్నారు. దరఖాస్తుతోపాటు విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, ఒక పాస్‌పోర్టు ఫొటో, రెండు స్టాంప్‌సైజు ఫొటోలు, ఇతర పత్రాలు ఉండాలన్నారు. పదో తరగతి విద్యార్హత కలిగి ఉండాలని, వివిధ సేవా సంస్థల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఎటువంటి వేతనం ఉండదని, శిక్షణ అనంతరం ఏడాది కాలానికి పారాలీగల్ వలంటీర్లుగా నియమిస్తామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

బీసీ బాలుర హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలి

పాయకరావుపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్షుడు రాము, కార్యదర్శి కృపానంద్ డిమాండ్ చేశారు. సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం తహసీల్దారు కార్యాలయం వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మాట్లాడుతూ వంద మంది విద్యార్థులు ఉన్న బీసీ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లు, తాగునీటి సమస్యలు ఉన్నాయన్నారు. రాత్రిపూట దోమలతో నిద్ర లేక విద్యార్థులు నరకాన్ని చవిచూస్తున్నారన్నారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో మండల ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రాము, వరుణ్, నాగేష్, సాయి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

నక్కపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయ రహదారిపై వెదుళ్లపాలెం జంక్షన్ వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. తుని నుంచి అనకాపల్లి వైపు ఖాళీ సిలెండర్ల లోడుతో వెళ్తున్న లారీ వెదుళ్లపాలెం జంక్షన్ వద్ద ముందు వెళుతున్న మరో లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ ముందుభాగం దెబ్బతింది. డ్రైవర్‌కు గాయాలయ్యాయి.

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే

ఎస్.రాయవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డరోడ్డు తిమ్మాపురంలో సోమవారం ఎలక్ట్రీషియన్ డేను ఘనంగా నిర్వహించారు. ఎలక్ట్రీషియన్‌ల సంఘం మండల అధ్యక్షుడు దారబోయిన గణేష్ జెండా ఆవిష్కరించిన అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రీషియన్ షాపుల యజమానులు, ఎలక్ట్రీషియన్‌లు పాల్గొన్నారు.

లోకేశ్‌ని కలిసిన జనసేన యువ నేత



లోకేశ్‌తో మాట్లాడుతున్న సందీప్

అచ్యుతాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంజేపురానికి చెందిన జనసేన యువనాయకుడు పీలా సందీప్ సోమవారం విశాఖ వచ్చిన మంత్రి లోకేశ్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. దావోస్ పర్యటనతో రాష్ట్రానికి భారీ పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందని, స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని వినతిపత్రాన్ని ఇచ్చానని ఆయన తెలిపారు. యువతకు స్కిల్స్‌లో ముందుగా శిక్షణ ఇప్పించే విధంగా చర్యలు చేపట్టాలని కోరానన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారన్నారు.

'పాల సేకరణను తగ్గించడం అన్యాయం'

అచ్యుతాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల నుంచి పాల సేకరణ తగ్గించాలని విశాఖ డెయిరీ నిర్ణయం రైతులకు కంటతడి తెప్పిస్తోందని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి కర్రి ఆదిబాబు అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటికే పాల సేకరణ ధరను తగ్గించి రైతుల నడ్డి విరిచిందన్నారు. పాల సేకరణను పెంచకపోగా అనధికారికంగా తగ్గించడానికి విశాఖ డెయిరీ యాజమాన్యం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రతి రోజూ పది లీటర్ల పాలు పోసే రైతు నుంచి తొమ్మిది లీటర్లే తీసుకొని మిగతా లీటరు పాలు వెనక్కి ఇస్తున్నారన్నారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. విశాఖ డెయిరీ ఈ నిర్ణయాన్ని మార్చుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

8న తిమ్మరాజుపేటలో రామాలయం ప్రారంభం

మునగపాక, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో తిమ్మరాజుపేటలో పునః నిర్మాణం చేసిన రామాలయాన్ని వచ్చే నెల 8వ తేదీన ప్రారంభించనున్నట్టు కమిటీ సభ్యులు మళ్ల స్వామి తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థుల భాగస్వామ్యంతో రూ.65లక్షలతో రామాలయం నిర్మించామన్నారు. వచ్చే నెల 6,7,8 తేదీలతో ఆలయ ప్రారంభోత్సవంతో పాటు విగ్రహాల ప్రతిష్ఠ పూజలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, శరగడం వెంకునాయుడు, సూరిశెట్టి రాము, కాండ్రేగుల జగన్, పచ్చికోరు నర్సింగరావు పాల్గొన్నారు.

అత్యాచారం కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించాలి

ఎలమంచిలి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ చేపట్టి, కఠినంగా శిక్షించాలని సీఐటీయూ, ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ నాయకులు వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మహిళకు రక్షణ లేకుండా పోతుందని సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్. శివాజీ అన్నారు. 20 రోజుల వ్యవధిలో మైనర్‌లపై రెండు ఘటనలు చోటుచేసుకోవడం బాధాకరమని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.బాలాజీ, విద్యార్థి సంఘం నేతలు అభిసుకుమార్ పాల్గొన్నారు.

అక్రమ గ్రావెల్ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

రాంబిల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాంబిల్లి పంచాయతీ శివారు కొండలదేవునిపాలెం గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండ వద్ద అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన గ్రావెల్ తవ్వకాలు చేపట్టిన కొండప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కొండ వద్ద రాత్రి వేళల్లో యంత్రాలతో గ్రావెల్ తవ్వకాలు జరిపి, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారన్నారు. ఈ విషయమై రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరపకుండా చర్యలు తీసుకోవాలని దేముడు నాయుడు కోరారు.

రోడ్డును తనిఖీ చేసిన క్వాలిటీ కంట్రోల్ అధికారులు

ఎస్.రాయవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాకపాడులో నూతనంగా నిర్మించిన తారు రోడ్డును సోమవారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. క్వాలిటీ కంట్రోల్ డీఈ నరసింహమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో రోడ్డు కొలతలు, నాణ్యత నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఏఈలు శ్రీధర్, రాము, కృష్ణారావు, ఎలమంచిలి ఏరియా ఏఈ సత్యవేణి పాల్గొన్నారు.

పశు వైద్యుల సేవలు వినియోగించుకోవాలి

మునగపాక, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పశువుల పెంపకంలో వైద్యులు, సిబ్బంది సేవలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ సునీల్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలో వెంకటాపురంలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరంలో ఆయన మాట్లాడారు. పశుగ్రాసం, గోకులం షెడ్‌లు వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలకంఠస్వామి, మాజీ సర్పంచ్ సుందరపు వెంకట కనకఅప్పారావు, పాల సొసైటీ అధ్యక్షుడు కాసులుబాబు, మండల పశువైద్యాధికారి ఎల్.ప్రదీప్ కుమార్, కూటమి నేతలు అనూరాధ, మాలతి పాల్గొన్నారు.

లక్ష్యానికి తూట్లు.. చెత్తతో పాట్లు..!

- నిర్లక్ష్యపు నీడలో తుమ్మపాల సంపద కేంద్రం
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మాణం
- పాలకులు, అధికారుల అలక్ష్యం
- మేజర్ పంచాయతీని వీడని చెత్త సమస్య
- డంపింగ్ యార్డులో కొండలా కుప్పలు


డంపింగ్ యార్డులో పెరిగిన చెత్త కుప్పలు



తుమ్మపాలలో నిరుపయోగంగా ఉన్న సంపద కేంద్రం


వృథాగా పడి ఉన్న చెత్తను పొడి చేసే మిషన్

తుమ్మపాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో చెత్త సమస్య పరిష్కారంతో పాటు పంచాయతీల ఆర్థిక పరిపుష్టికి గత తెలుగుదేశం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన సంపద కేంద్రాలు పలుచోట్ల నిరుపయోగంగా మారాయి. ఆయా పాలకవర్గాలు, అధికారుల అలసత్వం కారణంగా ఈ పరిస్థితి నెలకొంది. ఇందులో అనకాపల్లి మండలంలోని తుమ్మపాలలో గల సంపద కేంద్రం ఒకటి.

మేజర్ పంచాయతీ తుమ్మపాలలో దశాబ్ద కాలం క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.ఐదు లక్షలు వెచ్చించి సంపద కేంద్రాన్ని నిర్మించారు. చెత్త నుంచి సంపదను తయారు చేయడంపై పలువురికి శిక్షణను సైతం ఇచ్చారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలో రావడంతో ఈ కేంద్రం మూలకు చేరింది. దీంతో తుమ్మపాలలో చెత్త సమస్య మరింత అధికమైంది. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం అప్పటి జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశాల మేరకు స్వచ్ఛ పంచాయతీలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో మళ్లీ తుమ్మపాల సంపద కేంద్రం తెరపైకి వచ్చింది. రెండో విడతలో మరో రూ.రెండు లక్షలు కేటాయించి సంపద కేంద్రానికి ప్రహరీ గోడ నిర్మించి, దీనిని ఆనుకుని ఉన్న డంపింగ్‌యార్డును తరలించే ప్రయత్నం చేశారు. అయితే వివిధ కారణాలతో ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఫలితంగా ఈ కేంద్రం మూలకు చేరింది. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన యంత్రాలు తుప్పుపడుతున్నాయి. ప్రస్తుతం చీకటిపడితే ఈ కేంద్రం మందుబాబులకు అడ్డాగా మారింది. అసాంఘిక కార్యకలాపాలు సైతం సాగుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే, తుమ్మపాలలో ఏ మూలకు వెళ్లినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. అడపాదడపా పారిశుధ్య సిబ్బంది గ్రామంలో సేకరించిన చెత్తను సంపద కేంద్రం వద్ద గల డంపింగ్‌యార్డు వద్ద వేస్తున్నారు. దీంతో అక్కడ భారీగా పెరిగిపోయింది. గ్రామంలోని వ్యర్థాలను సైతం ఇక్కడే పారబోస్తున్నారని పలువురు చెపుతున్నారు. గ్రామంలో మెయిన్ రోడ్డును ఆనుకుని ఈ డంపింగ్ యార్డు ఉండడంతో ఇటుగా రాకపోకలు సాగించేవారితో పాటు సమీపంలో నివసించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటు దుర్వాసన, అటు దోమల బెడద భరించలేకపోతున్నామని వాపోతున్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించడంతో పాటు సంపద కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకు రావాలని అంతా కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకు వెళతా..

తుమ్మపాలలో చెత్త సమస్య పరిష్కారానికి అప్పట్లో ఈ కేంద్రాన్ని నిర్మించారు. పాలకవర్గం, అధికారుల అలసత్వం వల్ల నేడు నిరుపయోగంగా మారింది. దీనిపై పలుమార్లు సూచనలు కూడా చేశాం. ఉన్నతాధికారులతో చర్చించి సంపద కేంద్రం నిర్వహణ విషయంలో చొరవ తీసుకుంటాం. - ఏలూరి నాగలక్ష్మి, సంపద కేంద్రాల జిల్లా కో-ఆర్డినేటర్

డంపింగ్ యార్డు తరలించాలని ఆందోళన


తుమ్మపాలలో డంపింగ్‌యార్డు వద్ద నిరసన తెలుపుతున్న స్థానికులు

తుమ్మపాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ తుమ్మపాల నడిబొడ్డున ఉన్న డంపింగ్ యార్డును తక్షణమే తరలించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డంపింగ్‌యార్డు వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ నాయకుడు బొడ్డపాటి చినరాజారావు మాట్లాడుతూ గ్రామంలో సేకరించిన చెత్తను మెయిన్ రోడ్డును ఆనుకొని డంప్ చేస్తుండడంతో స్థానికంగా నివాసం ఉంటున్న వారితో పాటు రాకపోకలు సాగిస్తున్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బవులవాడ, దిబ్బపాలెం, ఊడేరు తదితర గ్రామాలకు ఈ డంపింగ్‌యార్డు పక్క నుంచే ప్రధాన రహదారి ఉండడంతో ఇటుగా వచ్చి వెళ్లేవారు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. తక్షణమే డంపింగ్‌యార్డును తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.


మహిళ సమస్య తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- అధికారులకు జాయింట్ కలెక్టర్ జాహ్నవి ఆదేశం


పోలీస్ కార్యాలయంలో అర్జీదారునితో మాట్లాడుతున్న ఏఎస్పీ దేవప్రసాద్

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : సమస్యలపై ప్రజల నుంచి అందే ప్రతి అర్జీపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. తొలుత ఆమె అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తే మరింత మంది ఉత్సాహంగా ముందుకు వచ్చి సమస్యలను విన్నవించే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆమె పలువురితో మాట్లాడి వారి నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లా నలుమూలల 214 మంది విచ్చేసి సమస్యలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో సత్యనారాయణరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయానికి 32 అర్జీలు

జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలువురి నుంచి ఏఎస్పీ దేవప్రసాద్ అర్జీలను స్వీకరించారు. ప్రతి అర్జీదారుడితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ముగిసే సమయానికి 32 మంది అర్జీలను సమర్పించారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజలు నుంచి అధికంగా భూ తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటి వాటికి సంబంధించిన అర్జీలు వచ్చినట్టు ఆ శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అప్పారావు, ఎస్ఐ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే కొణతాల సమీక్ష


అధికారులతో అభివృద్ధి పనులపై చర్చిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గుండాల జంక్షన్ వద్ద గల సమావేశ మందిరంలో సోమవారం మధ్యాహ్నం నుంచి రాత్రి ఏడున్నర గంటల వరకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా అధికారులతో మాట్లాడి ప్రస్తుతం జరుగుతున్న పనులు, భవిష్యత్తులో చేపట్టబోయే పనుల వివరాలను తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు ఏ విధంగా అందుతున్నాయో ఆరా తీశారు. భవిష్యత్తులో ప్రభుత్వం తరపున తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షేక్ ఆయిషాతో పాటు వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగ్ బాధితులు ఆందోళన

కొత్తూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కుంచంగి ల్యాండ్ పూలింగ్ బాధితుల పట్ల జిల్లా కలెక్టర్ నిర్లక్ష్యం తగదని పలువురు బాధితులు వాపోయారు. ఈ మేరకు సోమవారం సదరు భూముల్లో టెంటు వేసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ల్యాండ్ పూలింగ్ పేరుతో భూములు ఇచ్చిన బాధితులకు తిరిగి రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉన్నా ఆదిశగా చర్యలు చేపట్టలేదన్నారు. ఆయా భూములను రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చే వరకూ ఆ స్థలాల్లో ఎటువంటి కట్టడాలను చేపట్టేందుకు అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు పలుమార్లు వినతిపత్రం అందజేసినా ఎటువంటి స్పందన లేదని ఆరోపించారు.

ప్రైవేటు విద్యా సంస్థల ఆగడాలు అరికట్టాలని వినతి

తుమ్మపాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఫీజుల పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీ ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కర్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి జేసీ ఎం.జాహ్నవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్న వేళ ఫీజుల వసూళ్లకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థులను తీవ్ర ఒత్తిళ్లకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా సెలవు దినాలలో సైతం విద్యా సంస్థలను నడుపుతూ విద్యార్థులకు ఊపిరి సలపకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి ప్రైవేటు విద్యా సంస్థల ఆగడాలను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ఎ.ఫణేంద్ర, ఎం.రమణ తదితరులు పాల్గొన్నారు.

పది మద్యం బాటిళ్లతో వ్యక్తి పై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి ఆనుకొని ఉన్న కొత్తూరు జంక్షన్‌లో సోమవారం ఓ వ్యక్తి అక్రమంగా మద్యం తరలిస్తుంగా పట్టుకుని కేసు నమోదు చేసినట్టు సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. పిసినికాడకు చెందిన పీలా వీరునాయుడు పది మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి తన స్వగ్రామం వైపు తీసుకు వెళ్తుండగా కొత్తూరు జంక్షన్ వద్ద హెడ్‌కానిస్టేబుల్ ఎ.శ్రీనివాసరావుకు పట్టుబడ్డారన్నారు.

పల్లెల్లో పశు ఆరోగ్య శిబిరాలు

తుమ్మపాల/కశింకోట/పరవాడ/ సబ్బవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పశు ఆరోగ్య శిబిరాలను పలు గ్రామాల్లో సోమవారం నిర్వహించారు. అనకాపల్లి మండలం తుమ్మపాలలో పశువైద్యాధికారి డాక్టర్ సీహెచ్.అనిల్‌కుమార్ బృందం పశువులకు పరీక్షలు జరిపారు. సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, ఎంపీటీసీలు చదరం నాగేశ్వరరావు, పంచదార్ల కన్నారావు, నాయకులు పాల్గొన్నారు. కశింకోట మండలం విస్సన్నపేటలో మండల పశువైద్యాధికారిణి డాక్టర్ అల్ఫోన్సా జార్జ్ బృందం పశువులకు గర్భకోస పరీక్షలు నిర్వహించి, నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ ఉప్పునూరి మాణిక్యం, కూటమి నాయకులు పాల్గొన్నారు. పరవాడ మండలం నాయుడుపాలెం, భరిణికంలో పరవాడ పశువైద్యశాల సహాయ సంచాలకులు కీర్తి రామకృష్ణ, పశువైద్యాధికారులు సురేశ్‌కుమార్, అశ్విని పశువులకు పరీక్షలు జరిపారు. నాయకులు కూండ్రపు సీతారామయ్య, బొండా తాతారావు, పెదిశెట్టి శేఖర్ తదితరులు పాల్గొన్నారు. సబ్బవరం మండలం మొగలిపురంలో గుల్లేపల్లి పశు వైద్యాధికారిణి డాక్టర్ బి.సంధ్య, డాక్టర్ ఎస్.స్వర్ణలత పశువులకు వైద్య పరీక్షలు జరిపారు. సర్పంచ్ గండి అరుణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఫార్మాసిటీలో ఏడాదిలోగా ఉపాధి : ఎమ్మెల్యే పంచకర్ల


ముత్యాలమ్మపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల, చిత్రంలో సింహాద్రి సీజీఎం

పరవాడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులకు ఫార్మాసిటీలో ఏడాదిలోగా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తెలిపారు. సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులు రూ.30.55 లక్షలతో ముత్యాలమ్మపాలెంలో చేపట్టనున్న సీసీ రోడ్డు, రక్షిత మంచినీటి పథకం నిర్మాణానికి సోమవారం సింహాద్రి సీజీఎం సమీర్‌శర్మతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల సౌకర్యార్థం తీరంలో మినీజెట్టి నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్‌వీ అంబేడ్కర్, మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, సర్పంచ్ చింతకాయల సుజాత, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, ఎంపీటీసీ అర్జిల్లి దేవి, సింహాద్రి హెచ్ఆర్ విభాగం ఏజీఎం బీబీ ప్రాత, సీఎస్ఆర్ విభాగం ప్రతినిధులు కె.ప్రకాశరావు, ఎస్‌పీ సింగ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా ముత్యాలమ్మపాలెంలో ఉపాధి నిధులతో చేపట్టిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్ చింతకాయల సుజాత, పంచాయతీరాజ్ డీఈ పీవీ రమణమూర్తి, ఏఈ స్వాతి, ఎంపీటీసీ అర్జిల్లి దేవి, స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు,పాల్గొన్నారు.

'కూటమి పాలనలో రాష్ట్రాభివృద్ధి'

లంకెలపాలెం : కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెంలో సుమారు రూ. రెండు కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన చెరువును సోమవారం కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. అలాగే లంకెలపాలెం, దేశపాత్రునిపాలెం ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లగా రాష్ట్రంలో అభివృద్ధి కుటుపడిందన్నారు. కూటమి అధికారం చేపట్టాక అభివృద్ధి పరుగులు తీస్తున్నట్టు చెప్పారు. కూటమి నాయకులు పైలా జగన్నాథరావు, కర్రి దశేంద్ర, సర్వసిద్ధి సన్యాసిరాజు, కరణం నరసింగరావు, మోటూరి సన్యాసినాయుడు, బొద్దపు శ్రీనివాసకాసులు, రౌతు మూర్తి, చెలపరెడ్డి రామారావు, తాతారావు, కర్రి బుజ్జి, యర్రా కోటేశ్వరరావు, బుగిడి గోవిందరావు, రామారావు, గుర్రం నాయుడు, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన ఐదుగురిపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : కులం పేరుతో దూషించడమే కాకుండా కట్నం తీసుకురమ్మని వేధిస్తున్న వారిపై సోమవారం కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. పిసినికాడ పంచాయతీలోని బీఆర్టీ కాలనీకి చెందిన ఈదరాడ దేవి అనే మహిళ 2012లో ప్రేమ వివాహం చేసుకుందన్నారు. అనంతరం నూజివీడుకు వెళ్లిపోయారన్నారు. ఇటీవల కాలంలో భర్త చిరంజీవి, అత్తమామలు, ఆడపడుచు, ఆమె భర్త కులం పేరుతో దూషించడమే కాకుండా కట్నం తీసుకురమ్మని వేధిస్తున్నట్టు బాధితురాలు ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, కేసును నూజివీడు పోలీస్ స్టేషన్‌కు పంపుతున్నామని సీఐ చెప్పారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన


మహిళకు కంటి పరీక్ష జరుపుతున్న వైద్యాధికారిణి

పరవాడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి ఎన్టీపీసీ, శంకర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ముత్యాలమ్మపాలెంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తొలిత ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సింహాద్రి సీజీఎం సమీర్‌శర్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి శంకర్ ఫౌండేషన్‌కు చెందిన వైద్యశాలలో చేస్తామని తెలిపారు. శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు, వైద్య సిబ్బంది, సింహాద్రి సీఎస్ఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న సీఐ స్వామినాయుడు

కశింకోట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్‌లో విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ అల్లు స్వామినాయుడు మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం, సీటు బెల్టు పెట్టుకోవడం, స్కూల్ ఆటోల్లో ఓవర్ లోడింగ్ లేకుండా నియంత్రించడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మనోజ్‌కుమర్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.రాజన్న, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇనస్పెక్టర్ ఎ.గీతాకావ్య, రహదారి భద్రత సిబ్బంది డీఏ కృష్ణ, అశోక్‌కుమార్, కె.సత్యనారాయణ, ఎ.ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్సీ 'బుద్ద'


లోకేశ్‌కు బొకే అందిస్తున్న నాగజగదీశ్

అనకాపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జాతీయ కార్యదర్శి, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు సోమవారం విశాఖపట్నంలోని విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బుద్ద లోకేశ్‌కు పూల బొకే అందించి సత్కరించారు.

అన్న క్యాంటీన్‌లను తనిఖీ చేసిన జోనల్ కమిషనర్


ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న జెడ్సీ రమణ

అనకాపల్లి టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణ, భీమునిగుమ్మం జంక్షన్‌లలో గల అన్న క్యాంటీన్‌లను జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ బీవీ రమణ సోమవారం తనిఖీ చేశారు. రైల్వేస్టేషన్ వద్ద అన్న క్యాంటీన్ ప్రధాన మార్గంలోని తలుపులు పాడయ్యాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అల్పాహారం, భోజనం టైమింగ్స్‌కు సంబంధించిన డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. క్యూఆర్ కోడ్ అమలు పనితీరును పరిశీలించారు. అలాగే ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలోని అన్న క్యాంటీన్ వద్ద పైపులైన్ లీకేజీని పరిశీలించారు. ఇక్కడ భోజనం వేళల డిస్ప్లే బోర్డు బయట ఏర్పాటు చేయాలన్నారు. క్యాంటీన్‌లకు వచ్చే పేదల పట్ల ఎంతో గౌరవంగా మెలగాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రికులకు వ్యాక్సినేషన్


వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

అనకాపల్లి టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మక్కా మదీనా దర్శించే ఉమ్రా యాత్రికులకు సోమవారం ఇక్కడ వ్యాక్సిన్లు వేశారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ కె.చంద్రశేఖర్‌దేవ్ పర్యవేక్షణలో సదరు యాత్రికులకు కార్యాలయం ఆవరణలో వ్యాక్సినేషన్లు వేసినట్టు జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం అధికారులు తెలిపారు. పట్టణ కుటుంబ సంక్షేమ కేంద్రం అనకాపల్లి వైద్యాధికారి డాక్టర్ తిరుపతిరావు, సిరసపల్లి వైద్యాధికారి డాక్టర్ జహీరాలు నర్సింగ్ సిబ్బంది ద్వారా 39 మందికి వ్యాక్సినేషన్లు వేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక శాఖాధికారి రామచంద్రరావు, ఉప గణాంక శాఖాధికారి అబ్దుల్ రషీద్, జామియా మసీదు అధ్యక్షులు పీఎస్ఎన్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ ప్రాంతాన్ని కమ్మేసిన పొగమంచు

- ఉదయం తొమ్మిది వరకు వీడని తెరలు


పరవాడలో ఎనిమిదిన్నర గంటలకు కురుస్తున్న పొగమంచు

పరవాడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా మండల కేంద్రం పరవాడ పరిసర ప్రాంతాల్లో సోమవారం పొగమంచు దట్టంగా కురిసింది. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు మంచు తెరలు వీడలేదు. మరో పక్క చలిగాలులు వీయడంతో ప్రజలు గజగజ వణికిపోయారు. వృద్ధులు, చిన్నపిల్లలు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనదారులు హెడ్‌లైట్లు వేసుకొని నెమ్మదిగా రాకపోకలు సాగించారు. పొలాలకు వెళ్లే రైతులంతా ఆలస్యంగా ఇళ్ల నుంచి బయల్దేరడం కనిపించింది. ఇదిలావుంటే, దట్టమైన పొగమంచు కారణంగా మామిడి, జీడిమామిడి పూతకు తీరని నష్టం కలగనుందని ఆయా రైతులు ఆందోళన చెందుతున్నారు.

'మామిడిపాలెం గ్రామస్థులను కిడ్నీ వ్యాధి నుంచి రక్షించండి'

తుమ్మపాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం మామిడిపాలెంలో పెద్ద సంఖ్యలో గ్రామస్థులు కిడ్నీవ్యాధి బారిన పడుతున్నారని, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని ఆ గ్రామ సర్పంచ్ పూడి పరదేశినాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ తమ గ్రామంలో ఏటా పదుల సంఖ్యలో కిడ్నీవ్యాధి బారినపడి మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఆరోగ్యశాఖ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 1400 మందికి పరీక్షలు నిర్వహించగా, 300 మందికిపైగా కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నట్లు నిర్ధారించారన్నారు. అలాగే గత నాలుగు నెలల్లో ఐదుగురు కిడ్నీ వ్యాధితో మృతి చెందారన్నారు. సమస్యకు కారణాన్ని ఉన్నతాధికారులు వెంటనే గుర్తించి, వ్యాధి నుంచి గ్రామస్థులను కాపాడాల్సిందిగా ఆయన కోరారు.

వాడీవేడిగా మండల సమావేశం



హౌసింగ్ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

గ్రామాల్లో దాహం కేకలు పట్టించుకోరా...

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై సభ్యుల ధ్వజం

హౌసింగ్ బిల్లుల చెల్లింపులో అక్రమ వసూళ్లపై మండిపాటు

అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు: ఎమ్మెల్యే

ముంచంగిపుట్టు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో సమస్యలపై సభ్యులు ధ్వజమెత్తారు. అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. బిల్లుల చెల్లింపుల్లో అక్రమ వసూళ్లపై నిలదీశారు. గ్రామాల్లో దాహం కేకలు వినిపిస్తున్నా పట్టించుకోరా అంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మొత్తానికి సర్వసభ్య సమావేశం ఆద్యంతం వాడీవేడిగా జరిగింది.

మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ ఎ.సీతమ్మ అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మొదటిగా తాగునీటి సమస్యపై చర్చ జరిగింది. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేశ్ మాట్లాడుతూ జల జీవన్ మిషన్ పథకం కింద మండల పరిధిలో సుమారు రూ.5.78 కోట్లతో నీటి పథకం పనులు చేపడుతున్నామని, త్వరలో జోలాపుట్టు జలాశయం నుంచి ఏజెన్సీ 11 మండలాలకు వాటర్ గ్రిడ్ స్కీమ్ ద్వారా నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. కోట్లాది రూపాయలు వెచ్చించి గ్రామాల్లో తాగునీటి పథకాలు ఏర్పాటు చేస్తున్నా నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో ఏ గ్రామాన్ని సందర్శించినా దాహం కేకలు వేస్తున్నాయని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్మీపురం పంచాయతీ సుత్తిగూడ, మెట్టగూడలో తాగునీటి పథకంకు సంబంధించి కేవలం విద్యుత్ బోర్డులను మాత్రమే బిగించి వదిలేశారని, బిల్లులు మాత్రం పనులు పూర్తి అయినట్లు మార్చుకున్నారని సర్పంచ్ కె.త్రినాథ్ ఆర్‌లబ్ల్యూఎస్ ఏఈని ప్రశ్నించారు. 23 పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ ప్లాంట్లు సగానికి పైగా మూన్నాళ్లకే మూలకు చేరాయని, పలు గ్రామాల్లో నూతనంగా వేసిన తాగునీటి బోరింగులు చుక్క నీరు కూడా ఇవ్వడం లేదని సభ్యులు పేర్కొన్నారు. అలాగే సుజనకోటలో రూ.3.5 కోట్లతో ఏర్పాటు చేసిన నీటి పథకం ప్రారంభ రోజుల నుంచే మూలకు చేరుకుందని, అదే తరహాలో జోలాపుట్టులో వాటర్ గ్రిడ్ స్కీమ్ ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేయడం ఎలా సాధ్యపడుతుందని అనుకుంటున్నారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటర్ గ్రిడ్ స్కీమ్ ఏర్పాటును విరమించుకోవాలని, ప్రజా దనం వృధా అయే పనులు చేపడితే చూస్తూ ఊరుకోమని సభ్యులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. మండల పరిధిలో జరిగిన నూతన తాగునీటి పథకాల పనులపై సమగ్రమైన దర్యాప్తును జరిపి ఆ పనుల్లో చేతివాటం చూపించిన కాంట్రాక్టర్లు, అధికారులపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. దీంతో ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం స్పందిస్తూ గ్రామాల్లోకి వెళ్లి నూతనంగా చేపట్టిన తాగునీటి పథకం పనులను పరిశీలించి చేతివాటం చూపించిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. హౌసింగ్ ఏఈ మాట్లాడుతూ మండలంలో సుమారు 3,406 ఇల్లులు మంజూరయ్యాయని, మొదటి విడద 2,629 మంది లబ్ధిదారులకు బిల్లులు అందించామని, రెండో విడత 345 మందికి, మూడో విడత 22 మందికి బిల్లులు చెల్లింపులు జరిగాయని, ఒక ఇల్లు పూర్తయిందని ఏఈ తెలిపారు. బిల్లులు మంజూరులో కొంత మంది హౌసింగ్ అధికారులు, వర్కుఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ చేతివాటం చూపిస్తున్నారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లకు సైతం బిల్లులు మంజూరు చేయాలని సభ్యులు కోరారు. ఎంపీడీవో శ్రీహర్షసాయి మాట్లాడుతూ బిల్లుల చెల్లింపులో చేతివాటం చూపిస్తున్న వారి వివరాలను లిఖితపూర్వకంగా అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నూతన రేషన్ కార్డులు మంజూరు చేయడం లేదని, కార్డులలో నూతన పేర్లు యాడింగ్ జరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఏనుగురాయి. మాకవరం, దారెల తదితర పంచాయతీల పరిధిలో పలు గ్రామాలకు రహదారులు నిర్మాణంకు నిధులు మంజూరైనా పనులు జరగడంలేదని, పలు గ్రామాలలో అసంపూర్తిగా రహదారి పనులు నిలిచిపోయాయని సభ్యులు తెలిపారు. లబ్బూరు సమీపంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న ఏకలవ్య పాఠశాల భవనం ప్రారంభోత్సవం ఎప్పుడు చేపడతారని, పనులు ప్రారంభించి ఏళ్లుకావస్తున్నా నేటికీ ఎందుకు పూర్తి చేయలేకపోతున్నారని సభ్యులు ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. ఏకలవ్య పాఠశాలను ప్రస్తుతం తాత్కాలికంగా పెదబయలులో నిర్వహిస్తున్నారని, అక్కడ సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు తెలిపారు. అలాగే రెవెన్యూ, ఐసీడీఎస్, విద్యా శాఖ, విద్యుత్, ఆర్‌యండ్‌బీ , పంచాయతీరాజ్, తదితర శాఖలకు సంబంధించి సమావేశంలో వాడీవేడి చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేసుకుంటూ మండలాన్ని అభివృద్ధి దిశగా తీసుకువెళ్లాని సూచించారు. ఈ సమావేశానికి గైర్హాజరైన అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపీడీవో శ్రీహర్షసాయి తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీని బ్రాండ్‌గా తీర్చిదిద్దడమే సీఎం లక్ష్యం

▸▸ విజయనగరం ఆర్టీసీ రీజినల్ చైర్మన్ దొన్నుదొర


విలేకరుల సమావేశంలోని మాట్లాడుతున్న దొన్నుదొర

అనంతగిరి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఏపీని బ్రాండ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక కృషి చేస్తున్నారని విజయనగం ఆర్టీసీ రీజినల్ చైర్మెన్ ఎస్.దొన్నుదొర అన్నారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దావోస్ పర్యటన విజయవంతం కావడంపై ఆనందం వ్యక్తపరిచారు. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రాష్ట్రం నుంచి పెట్టుబడుదారులు వెనక్కి వెళ్లిపోయారన్నారు. విజన్-2047 దృష్టిపెట్టుకుని సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారని, ఇప్పటికే రాష్ట్రానికి రూ.5 లక్షల కోట్లు పెట్టుబడులతో సుమారు 50పైగా కంపెనీలు వచ్చాయని ఆయన తెలిపారు. 40 వేల మంది యువతీ, యువకులకు ఉద్యోగాలు కల్పించనున్నారన్నారు. జూమ్ కాల్‌తోనే రూ.1.46 కోట్ల పెట్టుబడిని, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తీసుకువచ్చారని చెప్పారు. విశాఖలోని రూ.2 లక్షల కోట్లతో నరేంద్రమోదీ సమక్షంలో ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారన్నారు. సమావేశంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు గరువులు, ఎంపీటీసీ సభ్యుడు సన్యాసిరావు, టీడీపీ నాయకులు పుష్పనందం, రవీంద్ర, జానకేశ్వరరావు, బాబీ పాల్గొన్నారు.

చిన్నారులకు మెరుగైన సేవలు

▸▸ టీడీపీ నాయకుడు పాండురంగస్వామి డిమాండ్


జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించిన టీడీపీ నాయకుడు పాండురంగస్వామి

పాడేరురూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మీజిల్స్ వ్యాధితో బాధపడుతూ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గిన్నెలకోట చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని టీడీపీ నాయకుడు, దారెల సర్పంచ్ పి.పాండురంగస్వామి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఆస్పత్రికి వెళ్లి చిన్నారులను పరామర్శించారు. వ్యాధి లక్షణాలను తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అనంత రం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వమిత్రతో మాట్లాడి చిన్నారులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. చిన్నారులకు వెంటనే పరీక్షలను నిర్వహించాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఎన్.ప్రసాద్, టి.మహేష్, మురళీ, టింకూ పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే


సంఘం ముఖ్యసలహాదారుడు సింహాచలం నాయుడును సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

పాడేరురూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పాడేరు మోద ఉమానీలకంఠేశ్వర ఎలక్ట్రీషియన్, ప్లంబర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కొట్టగుళ్లి రామారావు ఆధ్వర్యంలో సోమవారం నేషనల్ ఎలక్ట్రీషియన్స్ డేను ఘనంగా నిర్వహించారు. తొలుత జెండా ఆవిష్కరించి, థామస్ ఆళ్వా ఎడిసన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పట్టణంలో ప్రైవేటు ఎలక్ట్రీషియన్ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా ముఖ్య సలహాదారు కొట్టగుళ్లి సింహాచలం నాయుడు మాట్లాడుతూ యూనియన్ సభ్యులు అంతా ఒక్కతాటిపై ఉంటూ.. సంఘ సభ్యులను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. అనంతరం అసోసియేషన్ ప్రతినిధులు ఏపీఈపీడీసీఎల్ డీఈ బాలమురళీ, సింహాచలం నాయుడు, ఆధ్యాత్మిక సేవా బృందం సభ్యులు ఉప్పల వెంకటరత్నంలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ హనీఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి దామోదరం, జిల్లా, డివిజన్ నాయకులు ఎం.స్వామినాయుడు, పి.బల్లు, బి.ప్రకాశరావు, కె.సన్యాసిరావు, ఎ.నరేంద్రనాథ్, ఎల్.గిరిపాత్రుడు, కె.సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

తప్పించుకున్న గంజాయి నిందితులను అరెస్టు చేయండి

▸▸ జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ ఆదేశం


జిల్లా పోలీస్ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అమిత్ బర్దార్

పాడేరురూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న నిందితులను అరెస్టు చేసేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ ఆదేశించారు. సోమవారం ఎస్పీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు తెలుసుకొని పరిష్కారానికి తగిన సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమోదైన కేసులపై వెంటనే ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి చార్జిషీట్‌లను కోర్టులో సమర్పించాలన్నారు. ముఖ్యంగా గంజాయి కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న నిందితులను అరెస్టు చేయాలని ఆదేశించారు. గంజాయి సాగుపై అనుమానం ఉన్న ప్రాంతాల్లో డ్రోన్స్‌ను వినియోగించి పంటలను ధ్వంసం చేయాలన్నారు. పక్క రాష్ట్రాల్లో మావోయిస్టులు కదలికలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పోలీసు స్టేషన్‌లలో భద్రత పెంచాలని, మావోయిస్టుల కదలికలపై సమాచారాన్ని సేకరించాలన్నారు. త్వరలో జరగనున్న అరకు చలి ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అడిషనల్ ఎస్పీ కె.ధీరజ్, ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా, చింతూరు, చింతపల్లి, రంపచోడవరం డీఎస్పీలు, సీఐలు సంజీవరావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

వాటర్‌గ్రిడ్ స్కీమ్ ఏర్పాటుపై పునరాలోచించాలి

▸▸ అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం


సుజనకోట సమీపంలో మత్స్యగెడ్డ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ముంచంగిపుట్టు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జల్‌జీవన్ విషన్ పనులను రద్దు చేసి వాటర్‌గ్రిడ్ స్కీమ్ విధానంగా ద్వారా ప్రజలకు తాగునీటిని అందించాలనే యోచనను ప్రభుత్వం పునరాలోచించాలని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సూచించారు. సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో వాటర్ గ్రిడ్ స్కీమ్‌పై చర్చ జరిగింది. అలాగే గ్రిడ్‌కు తలూపితే నిధులు నీటి పాలేనా? అంటూ మండలంలోని సుజనకోటలో రూ.3.5 కోట్లతో ఏర్పాటు చేసిన మినీ వాటర్ గ్రిడ్ స్కీమ్ మూలకు చేరిందని, దీంతో కోట్లాది రూపాయలు ప్రజాధనం వృథా అయ్యాయనే విషయం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిందని ఎమ్మెల్యే తెలుసుకున్నారు. దీంతో సోమవారం సుజనకోటలో నిరుపయోగంగా ఉన్న నీటి పథకాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. కొంత దూరం కాలినడకన పర్యటించారు. వృథాగా ఉన్న నీటి పథకంతో పాటు పర్యాటక అభివృద్ధి చేసేందుకు మత్స్యగెడ్డ తీర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.1,500 కోట్లు వెచ్చించి వాటర్ గ్రిడ్‌స్కీమ్ ఏర్పాటు చేసి జోలాపుట్టు జలాశయం నుంచి సుమారు 11 మండలాలకు నీటిని సరఫరా చేసేందుకు సన్నహాలు చేయడాన్ని విరమించుకోవాలని పేర్కొన్నారు. ఇటువంటి పథకాలు వల్ల ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు, కాంట్రాక్టర్లకు జేబులు నిండుతాయని, ప్రజలకు ఉపయోగం ఉండదని ఆయన పేర్కొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

▸▸ ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి, శాస్త్రవేత్త బిందు


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డిజిటల్ గ్రీన్ ప్రతినిధి శ్రీకాంత్

చింతపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేసుకుంటే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చునని స్థానిక ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి, శాస్త్రవేత్త చెట్టి బిందు అన్నారు. సోమవారం పరిశోధన స్థానం సమావేశమందిరంలో డిజిటల్ గ్రీన్, ఉద్యాన శాఖ సంయుక్తంగా హార్టికల్చర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లకు భూసార పరీక్షలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బిందు మాట్లాడుతూ ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల భూమిలోపల పోషకాల వివరాలు గుర్తించవచ్చునన్నారు. తద్వారా అవసరమైన సూక్ష్మ పోషకాలను పెట్టుకోవడం వల్ల మంచి దిగుబడి వస్తుందన్నారు.

డిజిటల్ గ్రీన్ ప్రతినిధి శ్రీకాంత్ మాట్లాడుతూ గిరిజన రైతులు పసుపు పంటను ఆధునిక సేద్యపద్ధతులను పాటిస్తూ సాగు చేసుకోవాలన్నారు. రైతులు పసుపును బెడ్స్‌ను ఏర్పాటు చేసుకుని నాట్లు వేసుకోవాలన్నారు. ఈవిధంగా చేస్తే దుంపకుళ్లు తెగులను నియంత్రించుకోవచ్చునన్నారు. గిరిజన ప్రాంతంలో రైతులు పండించిన పసుపులో కుర్కుమిన్ శాతం అధికంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి కంటా బాలకర్ణ, ఏవో మధుసుదనరావు, చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు మండలాల వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ దృష్టికి పాడేరు బైపాస్ సమస్య


సబ్ కలెక్టర్‌ను కలిసిన పెసా కమిటీ ప్రతినిధులు

పాడేరురూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పాడేరులో చేపడుతున్న బైపాస్ రోడ్డు నిర్మాణంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సబ్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ దృష్టికి పెసా కమిటీ ప్రతినిధులు సోమవారం తీసుకువెళ్లారు. బైపాస్ నిర్మాణ పనులతో డ్రైనేజీ, డైవర్షన్, రైతుల పంట పొలాలల్లో మట్టి పడడం వంటి సమస్యలతోపాటు కొంత మంది రైతులకు ఇప్పటికీ నష్టపరిహారం అందలేదని వివరించారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ మాట్లాడుతూ పెసా కమిటీ ప్రతినిధులు ముందుగా ఫీల్డ్ విజిట్ చేసి ఎక్కడ ఏమి అవసరమో అనే దానిపై నివేదికను తయారు చేసుకొని ఫిబ్రవరి 4వ తేదీన అందించాలని, అదేరోజు సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వినతిపత్రాన్ని అందజేశారు. సబ్ కలెక్టర్‌ను కలిసిన వారిలో పెసా కమిటీ సభ్యులు సల్లా రామకృష్ణ, బోనంగి వెంకటరమణ, కిల్లు రాధాకృష్ణం నాయుడు, కొట్టగుళ్లి సింహాచలం నాయుడు పాల్గొన్నారు.

'పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి'

అనంతగిరి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివలింగపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాలను యూటీఎఫ్ మండల నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరీకిని ఓటువేసి గెలిపించాలని, అభ్యర్థించారు. చట్టసభల్లో అవగాహన కలిగిన వ్యక్తులను ఓటువేసి గెలిపిస్తే.. సమస్యలపై మాట్లాడడంతో పాటు ప్రశ్నించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలోని యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎన్. మల్లేశ్వరరావు, దేముడు, రాంబాబు, గంగరాజు, కొండబాబు, అమ్మారావు తదితరులు పాల్గొన్నారు.

కాఫీకి గరిష్ఠ ధరలు : డీఎం

చింతపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు పండించిన కాఫీకి గిరిజన సహకార సంస్థ గరిష్ఠ ధరలు అందజేస్తున్నదని స్థానిక డివిజన్ మేనేజర్ పి. దేవరాజు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజన రైతులకు మార్కెట్ ధరలను అందించాలనే లక్ష్యంగా జీసీసీ పనిచేస్తుందన్నారు. జాతీయ మార్కెట్ ఆధారంగా ధరలు పెంచడం జరిగిందన్నారు. కిలో పార్చిమెంట్ రూ.350, చెర్రీ రూ.200, రొబస్టా రూ.130 ధరలు కొనుగోలు చేస్తామన్నారు. కాఫీ గింజలను జీసీసీ ఉద్యోగులు రైతుల వద్దకు వచ్చి కచ్చితమైన తూకానికి కొనుగోలు చేస్తున్నారన్నారు. రైతులు కాఫీ గింజలను జీసీసీకి అప్పగించిన వెంటనే నగదు చెల్లించడం జరుగుతుందన్నారు. జీసీసీ సేవలను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి సమాచారం కోసం 8639393525, 7013070990 నంబర్లకు ఫోన్ చేయవచ్చునన్నారు.

నేడు పాడేరులో జాబ్‌మేళా

పాడేరురూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఇన్నోసోర్స్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ సహకారంతో టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు మంగళవారం స్థానిక మోదకొండమ్మ కల్యాణ మండపంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు సీఐ డి.దీనబందు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ చదివిన 18 నుంచి 26 ఏళ్లలోపు వయస్సు గల పాడేరు, హుకుంపేట, డుంబ్రిగూడ, అరకు, అనంతగిరి, జి.మాడుగుల, ముంచంగిపుట్టు, పెదబయలు మండలాలకు చెందిన గిరిజన యువతీ యువకులు హాజరు కావాలన్నారు.

30న చింతపల్లిలో జాబ్‌మేళా : సీఐ

సీలేరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్‌ల ఆధ్వర్యంలో గిరిజన యువతకు ఉపాధి కల్పించేందుకు ఈనెల 30వ తేదీన చింతపల్లిలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు జీకేవీధి సీఐ వరప్రసాద్ తెలిపారు. ఇన్నోసోర్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థలో ఉద్యోగాల కోసం టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ చదివిన వారు హాజరుకావాలని కోరారు. 18 నుంచి 26 సంవత్సరాలు కలిగిన గిరిజన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏమైనా సమాచారం కావలిస్తే తనను స్వయంగా సంప్రదించవచ్చునని, 9440904236 ఫోన్ చేయవచ్చునని సీఐ వరప్రసాద్ తెలిపారు.

గిరిజన మహిళలకు కుట్టు శిక్షణ ప్రారంభం


గిరిజన మహిళలకు కుట్టు శిక్షణ ప్రారంభించిన దృశ్యం

సీలేరు, జనవరి 27, (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు జి.42 బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం మహిళలకు కట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఎటువంటి ఆధారం లేని నిరుపేద గిరిజన మహిళలకు నెల రోజులపాటు కుట్టు శిక్షణ ఇచ్చిన తర్వాత కుట్టుమిషన్లను అందజేస్తామని సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వినోద్ తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంకా ఎవరైనా నిరుపేద గిరిజన మహిళలు ఉన్నట్టయితే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

నీరు, పారిశుధ్య కమిటీలు సమర్థంగా పనిచేయాలి

▸▸ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కల్యాణ్‌రామ్


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కల్యాణ్‌రామ్

గూడెంకొత్తవీధి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నీరు, పారిశుధ్యం కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కల్యాణ్ రామ్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వై.ఉమామహేశ్వరరావు అధ్యక్షతన నీరు, పారిశుధ్యం కమిటీల విధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఈఈ మాట్లాడుతూ మండలంలోని 16 పంచాయతీ పరిధిలో 141 నీరు, పారిశుధ్యం కమిటీలు ఉన్నాయన్నారు. ఈ కమిటీలు గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు, నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ హౌసింగ్ ఉద్యోగులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఆవాస్ ప్లస్ సర్వేను వేగవంతం చేయాలన్నారు. పీఆర్-1 యాప్ వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ పాపారావు, హౌసింగ్ ఏఈ సూరిబాబు పాల్గొన్నారు.

వైభవంగా సంవిధాన్ గౌరవ అభియాన్



విజేతలకు బహుమతులు అందిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శాంతకుమారి

పాడేరురూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం సంవిధాన్ గౌరవ అభియాన్‌ను జిల్లా ఇన్‌చార్జి పెనుమాక రవికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షురాలు ఎం.శాంతకుమారి మాట్లాడుతూ డాక్టర్.బీఆర్ అంబేద్కర్‌కు భారతరత్న అవార్డును ఎన్‌డీఏ ప్రభుత్వమే ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా క్విజ్ పోటీలో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు సల్లా రామకృష్ణ, కుడుముల వెంకటరమణ, ఎల్.అబ్బాయి దొర, సత్యవతి, కళాశాల అధ్యాపకులు అచ్యుతరావు, శంకరరావు, ప్రసాద్, పెసా కమిటీ కార్యదర్శి సింహాచలం పాల్గొన్నారు.

'వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి'


వాహనాల రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు

చింతపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని స్థానిక ఎస్ఐ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వాహన తనిఖీలు నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్సు, వాహనాల రికార్డులేని 15 మందికి అపరాధ రుసుము విధించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన రికార్డులు పూర్తి స్థాయిలో ఉండాలన్నారు. ద్విచక్రవాహనాలు అతివేగంగా ప్రయాణించరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. ద్విచక్రవాహనదారులు కచ్చితంగా హెల్మెంట్ ధరించాలన్నారు.

ఆస్పత్రి పారిశుధ్య కార్మికులకు రూ.26 వేలు వేతనం చెల్లించాలని వినతి


ఆస్పత్రికి ఇన్‌చార్జికి వినతిపత్రం అందిస్తున్న పారిశుధ్య కార్మికులు

అరకులోయ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు రూ.26 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆస్పత్రి ఇన్‌చార్జికి వినతిపత్రం అందించారు. అనంతరం సీఐటీయూ నాయకుడు రామారావు, పిరయూనియన్ సెక్రెటరీ రఘు మాట్లాడుతూ ప్రస్తుతం తమకు రూ.11,200 మాత్రమే చెల్లిస్తున్నారని, ఇది ఎటుకూ చాలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఆసుపత్రిలో నూతనంగా చేరిన కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులందరికీ పీఎఫ్. ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన క్రమంలో జీవో ప్రకారం రూ.26 వేల జీతాలు చెల్లించాలని విన్నవించారు. అలాగే జీతంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు విశ్రాంతి గదులు నిర్మించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, శానిటేషన్ యూనియన్ ప్రతినిధులు రఘు, కాసులమ్మ, రామచంద్ర, రామారావు, మండల కమిటీ సభ్యులు ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ ఎల్.రామును కలిసి వినతిపత్రం అందజేశారు.



నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న బత్తుల తాతయ్యబాబు

లోకేశ్‌కు గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ తాతయ్యబాబు స్వాగతం

బుచ్చెయ్యపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరానికి వచ్చిన విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి జిల్లా టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు సోమవారం సాదరంగా స్వాగతం పలికారు. విశాఖ ఎయిర్‌పోర్టులో మంత్రి లోకేశ్‌ను కలిసిన తాతయ్యబాబు, ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు.

ప్రజా ఫిర్యాదుల వేదికలో 18 అర్జీలు

నర్సీపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 18 వినతులు వచ్చినట్టు ఆర్డీవో వీవీ.రమణ తెలిపారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన వినతులను ఆయన స్వీకరించారు. మునిసిపాలిటీలోని డ్రైనేజీ సమస్యలపై రెండు, భూ సమస్యలపై 16 అర్జీలు వచ్చాయని, వీటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు.

న్యాయ సహాయకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల లీగల్ సర్వీస్ కమిటీలో న్యాయ సహాయకులుగా స్వచ్ఛందంగా పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సేవాధికార సంస్థ చైర్మన్, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) పి.షియాజ్ ఖాన్ ఒక ప్రకటలో తెలిపారు. దరఖాస్తుదారులు పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని చెప్పారు. ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఏదైనా స్వచ్ఛంద సేవా సంస్థలో పని చేసినవారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

ఈకేవైసీ చేయించుకోండి

గొలుగొండ , జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సొసైటీ సభ్యులు త్వరితగతిన ఈకేవైసీ చేయించుకోవాలని అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్, సొసైటీ ఇన్‌చార్జి డి.శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రంలోని చోద్యం సొసైటీలో సోమవారం రికార్డులు పరిశీలించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ చోద్యం సొసైటీలో 2626 మంది, చీడిగుమ్మల సొసైటీలో సుమారు 600 మంది సభ్యులుగా ఉన్నారన్నారు. సొసైటీ రుణాలు, ప్రభుత్వ రాయితీల కోసం వారంతా ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు.

'కూటమి ప్రభుత్వంలో సర్పంచులకు పెరిగిన గౌరవం'

నాతవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో సర్పంచులకు గౌరవం పెరిగిందని తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ పేర్కొన్నారు. శరభూపాలపట్నం గ్రామంలో రూ.30 లక్షలతో నిర్మించనున్న శ్మశానవాటిక షెడ్డు, సీసీ రోడ్డుకు సర్పంచ్ లోకవరపు సత్యనారాయణతో కలసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో నిధులు లేకపోవడంతో సర్పంచులు ఉత్సవ విగ్రహాల్లా మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తాము ఎందుకు ఎన్నికయ్యామా? అని బాధపడేవారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలల్లోనే శరభూపాలపట్నంలో రూ.30 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం ఆనందకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎ.రాంబాబు పాల్గొన్నారు.

మేలుజాతి దూడలతో పశు సంపద వృద్ధి: ఏడీ శ్రీనివాస్

నాతవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మేలుజాతి దూడలతో పశు సంపదను అభివృద్ధి చేసుకోవచ్చునని పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకుడు (ఏడీ) జి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. వల్సంపేట గ్రామంలో సోమవారం జరిగిన పశువైద్య ఆరోగ్య శిబిరంలో ఆయన మాట్లాడుతూ లింగనిర్ధారిత వీర్యం ద్వారా 90 శాతం మేలుజాతి దూడలను పుట్టించడం జరిగిందన్నారు. అలాగే 75 శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలు, హామీ లేకుండా ఏడు శాతం వడ్డీతో రూ.2 లక్షలు ఇస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యురాలు శరణ్య, మాజీ సర్పంచ్ యోగి, స్థానిక నేత మిడతాన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తునివలస, బి.సింగవరం గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు

చీడికాడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తునివలస, సింగవరం గ్రామాల్లో సోమవారం పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాల్లో పశు వైద్యులు జి.గాయిత్రిదేవి, ఎ.గణేశ్‌కుమార్ సేవలు అందించారు. ఎంపీటీసీ సభ్యుడు పైల ముత్యాల నాయుడు, సర్పంచ్ పడాల హైమ, కోనాం జలాశయం వైస్ చైర్మన్ కొట్యాడ చిన్నంనాయుడు, మాజీ సర్పంచ్ పేరపు కొండబాబు, టీడీపీ నేత ఎస్.శివ పాల్గొన్నారు.

గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వహణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

రోలుగుంట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రోలుగుంట, జె.నాయుడుపాలెం, బుచ్చెంపేట గ్రామాల్లో మద్యం దుకాణాల యజమానుల ప్రోత్సాహంతో బెల్టు షాపులను నిర్వహిస్తున్నారని స్థానిక నాయకులు యర్రంశెట్టి వెంకటరమణ, కోసూరు శ్రీను తదితరులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామాల్లో బహిరంగ వేలం పాటలు నిర్వహించి మద్యం సరఫరా చేస్తున్నారన్నాని ఆరోపించారు. వీటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

మద్యం అధిక ధరలపై చర్యలు చేపట్టాలి

మాకవరపాలెం: మద్యం దుకాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని టీడీపీ నేతలు యర్రంశెట్టి వెంకటరమణ, కోసూరు శ్రీనివాసరావు సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. ఎమ్మార్పీ కంటే రూ.10 నుంచి రూ.20 వరకు అధికంగా అమ్ముతున్నారని ఆరోపించారు. అలాగే గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులను తెరిచారని, వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పెన్షన్.. అనర్హుల్లో టెన్షన్

దొంగ సర్టిఫికెట్లతో చాలా మందికి దివ్యాంగ పింఛన్లు
వైద్యాధికారుల పునఃపరిశీలనతో గుబులు
పేర్లు తొలగించకుండా నాయకుల చుట్టూ ప్రదక్షిణలు

మాడుగుల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అర్హత లేకపోయినా దివ్యాంగుల పింఛన్ తీసుకుంటున్న వారిలో గుబులు రేగుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో రాజకీయ నాయకుల అండదండలతో ఏ లోపం లేకపోయినప్పటికీ దివ్యాంగులుగా సదరం దొంగ సర్టిఫికెట్‌లు చేయించుకుని ఎంచక్కా సర్కారు ఖజానాకు చిల్లు పెడుతున్న వారంతా ఇప్పుడు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో దివ్యాంగుల పింఛన్లపై వైద్యాధికారులు పునఃపరిశీలన చేస్తుండడంతో పింఛన్ పోతుందన్న భయం వెంటాడుతోంది.

అర్హత లేకుండా తీసుకొంటున్న పింఛన్‌లను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కూటమి ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో గత వైసీపీ ప్రభుత్వంలో మంజూరుచేసిన సదరం సర్టిఫికెట్‌లను రీ వెరిఫికేషన్ చేసి అర్హత కలిగిన వారిని ఉంచి, అనర్హుల సదరం సర్టిఫికెట్‌లు తొలగించేందుకు ప్రత్యేకంగా విచారణ ప్రారంభించారు. దీంతో అర్హత లేకుండా దొంగ సదరన్ సర్టిఫికెట్‌లతో పింఛన్ తీసుకొంటున్న వారిలో టెన్షన్ మొదలైంది. దీంతో ఉన్న పింఛన్ పోకుండా గత వైసీపీ ప్రభుత్వ నాయకుల ద్వారా సదరం సర్టిఫికెట్ చేయించుకొని పింఛన్ పొందుతున్న వారంతా, ప్రస్తుతం అధికార పార్టీ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పింఛన్ పోకుండా చూడాలని, ఇందుకోసం ఎంత ఖర్చయినా ఫర్వాలేదని నాయకులను వేడుకుంటున్నారు. అధికారులకు సిఫారసు చేసే దిశగా దొంగ పింఛన్‌దారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయో వేచిచూడాలి.



దివ్యాంగుల సదరం సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న వైద్యులు

సదరం సర్టిఫికెట్ల పరిశీలన

మాడుగుల రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో సదరం సర్టిఫికెట్లను వైద్యుల బృందం సోమవారం పరిశీలించింది. మండలంలోని 16 గ్రామాల్లో 58 మెడికల్ పెన్షన్ లబ్ధిదారులను మూడు టీమ్‌లుగా వైద్యులు పరిశీలించారు. లబ్ధిదారులను నేరుగా కలిసి, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పింఛన్ పంపిణీపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కొంకి అప్పారావు, వైద్యులు పాల్గొన్నారు.

రావికమతంలో తాగునీటి సమస్యకు చెక్

రూ.1.45 కోట్లతో రక్షిత నీటి పథకానికి శ్రీకారం

రావికమతం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎట్టకేలకు తాగునీటి సమస్య తీరనుంది. రావికమతంలో తాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రక్షిత నీటి పథకం నిర్మాణానికి రూ.1.45 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో 60 వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు బీజం పడింది. సోమవారం ఈ పనులను రావికమతం సర్పంచ్, ఉప సర్పంచ్ గంజి మంగ, మోదునాయుడు ప్రారంభించారు. ముందుగా బోరు బావి నిర్మాణ పనులను అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రావికమతంలో తాగునీటి సమస్యను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు దృష్టికి తీసుకు వెళ్లామని, దీనికి ఆయన స్పందిస్తూ జల జీవన్ పథకం ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందేలా ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు రూ.1.45 కోట్లు మంజూరు చేయించారని చెప్పారు. ఈ నిధులతో 60 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు నిర్మాణం పూర్తిచేసి, గ్రామంలో ప్రతీ ఇంటికి సురక్షితమైన నీరు అందించాలన్నదే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు వేపాడ లక్ష్మి, వైసీపీ మాజీ మండల అధ్యక్షుడు కె.జగన్నాథరావు, కూటమి నాయకులు జి.వెంకటరమణ, ఈశ్వరావు, పి.సత్యనారాయణ, కె.సత్యనారాయణ, జి.అప్పలనాయుడు, వై.నాగభూషణం, టి.సూరిబాబు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

బాలకృష్ణకు పద్మభూషణ్‌పై జనసేన హర్షం

చోడవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారం ప్రకటించడంపై జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు హర్షం వ్యక్తం చేశారు. తెలుగుజాతి ఖ్యాతిని ఇనుమడింపచేసేలా తన నటనా కౌశలంతో తెలుగు సినిమాకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకు వచ్చిన బాలకృష్ణకు ఈ అవార్డు రావడం తెలుగు ప్రజలు గర్వించదగిన విషయమని ఆయన కొనియాడారు.

మోదకొండమ్మకు వెండి విరాళం

మాడుగుల రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎం.కోడూరులో కొలువైన మోదకొండమ్మ భక్తులు సోమవారం కిలో వెండిని విరాళంగా అందించారు. ఇదే గ్రామానికి చెందిన గాలి వెంకట ఈశ్వర అప్పారావు, గంగాధర్ కుటుంబ సభ్యులు చెరొక అర కిలో చొప్పున కిలో వెండిని సర్పంచ్, ఆలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి సంజీవరావుకి అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి

రోలుగుంట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చెంపేట పాఠశాల విద్యార్థులకు నవతరం ఫౌండర్ సబ్బవరపు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. అలాగే స్థానిక ఆసుపత్రిలో రోగులకు పోషకాహారం అందించారు. వార్డు కార్యదర్శి అనిమిరెడ్డి రమణ, సభ్యులు ఉలబాల రమణ, కర్రి రాముడునాయుడు, కర్రి రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి

మాకవరపాలెం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలని ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారి హేమసుందర్ సూచించారు. లచ్చన్నపాలెంలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎండీఎస్ పద్ధతి ద్వారా మినుములు, పెసర, బొబ్బర్లు, చిక్కుడు, నువ్వులు, ఆముదం, వేరుసెనగ, ధనియాలు, మెంతులు, ఆవాలు వేయాలని సూచించారు. చీడపీడలు, తెగుళ్లను తట్టుకునే సామర్థ్యం ఈ పద్ధతిలో ఉంటుందని ఆయన చెప్పారు. అనంతరం ఎరువుల తయారీ విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ డేను అధికారికంగా గుర్తించాలి

నర్సీపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జనవరి 27 తేదీన ఎలక్ట్రీషియన్ డేగా గుర్తించాలని శ్రీవిజయలక్ష్మీ దుర్గా ప్రైవేటు ఎలక్ట్రికల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్‌చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. ఎలక్ట్రీషియన్ డేను ప్రభుత్వం అధికారికంగా గుర్తించేలా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ రాజేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిదులు లంక వీరాపాత్రుడు, దేశెట్టి వెంకట సత్యనారాయణ, పిట్ల మంగరాజు, ఎస్.జానకి రామయ్య పాల్గొన్నారు.

చోడవరంలో...

చోడవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సిద్ధి వినాయక ప్రైవేటు ఎలక్ట్రికల్, ప్లంబింగ్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎలక్ట్రీషియన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గనిరెడ్డి కల్యాణ గంగాధర్ ఆధ్వర్యంలో కార్మికులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్మికుల ఐక్యత వర్థిల్లాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నమ్మి శ్రీను, డి.శివకుమార్, కోన మధు, చొప్ప పెంటారావు, మచ్చ గిరి, మూర్తి, కరకాన అప్పారావు, బూరె నరసింహారావు, బత్తిన సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

చెరకు రైతులకు అండగా పోరాటాలకు సిద్ధం

వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి అమర్‌నాథ్

చోడవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ చెరకు రైతులకు అండగా పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి గుడివాడ అమర్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ మాజీ విప్ ధర్మశ్రీతో కలిసి సోమవారం సాయంత్రం విలేకరులతో ఆయన మాట్లాడారు. లక్షల కోట్ల రూపాయలతో పరిశ్రమలు తెస్తామని ప్రకటనలు చేస్తూ, రాష్ట్రంలో మిగిలిన ఒక్క షుగర్ ఫ్యాక్టరీని కూడా కాపాడుకోలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని ఆరోపించారు. గోవాడను కాపాడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందని, ఆ దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. గోవాడ ఫ్యాక్టరీని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌కు అప్పగించేస్తారన్న ప్రచారం జరుగుతున్నదని, ఫ్యాక్టరీ భవిష్యత్‌పై రైతులు, కార్మికులకు వాస్తవాలు తెలపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మాజీ విప్ ధర్మశ్రీ మాట్లాడుతూ గోవాడపై చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలతో పాటు ఎంపీ కూడా స్పందించాలన్నారు. సీఎంకు నివేదికలు ఇస్తున్నామని ప్రకటనలతోనే నేతలు కాలక్షేపం చేయడం సరికాదన్నారు. రెండు నియోజకవర్గాలకు చెందిన వేలాది మంది రైతులు, కార్మికుల జీవితాలు ఆధారపడిన గోవాడకు అన్యాయం జరిగితే రైతుల తరఫున పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వైసీపీ నేతలు ఏడువాక సత్యారావు, జిల్లా వైసీపీ యూత్ అధ్యక్షుడు ఫుల్లేటి వెంకటేశ్, పల్లా నరసింగరావు, బొడ్డేడ సూర్యనారాయణ, డీవీఆర్.లింగబాబు, బొడ్డేడ సూర్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అమర్, పక్కన ప్రభుత్వ మాజీ విప్ ధర్మశ్రీ

నర్సీపట్నంలో స్నోయగాలు

ఉదయం 7 గంటల వరకు వదలని పొగమంచు

నర్సీపట్నం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని పొగమంచు కమ్మేసింది. సోమవారం తెల్లవారు జాము నుంచి ఉదయం 7 గంటలు వరకు మెయిన్ రోడ్డులో మంచు ఆవహించడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించలేదు. హెడ్‌లైట్స్ వెలుగులో వాహనదారులు రాకపోకలు సాగించాల్సి వచ్చింది. మెయిన్ రోడ్డుతో పాటు ఎన్టీఆర్ మినీ స్టేడియం, పెద్ద చెరువు, శారదానగర్ పాటు పట్టణ శివారు ప్రాంతాలలో పొగ మంచు దుప్పటి కప్పేయడంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది.



పంట పొలాలను ఆవహించిన మంచు తెరలు



మెయిన్ రోడ్డులో మంచుతో లైట్లు వేసుకుని వెళ్తున్న వాహనదారుడు

అమరావతికి దివ్యాంగుడి సైకిల్ యాత్ర

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలవడానికి ప్రయాణం

నాతవరం/రావికమతం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలవటానికి ఓ దివ్యాంగుడు అమరావతికి సైకిల్ యాత్ర చేపట్టాడు. ఇందుకోసం సోమవారం బుచ్చెయ్యపేట మండలం పొట్టిదొరపాలెం గ్రామం నుంచి ప్రయాణమయ్యాడు. పొట్టిదొరపాలెం గ్రామానికి చెందిన కొల్లిమల్ల పెంటారావు పుట్టికతో దివ్యాంగుడు (చెవిటి, మూగవాడు). పవన్ కల్యాణకు ఆయన వీరభిమాని. పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సనాతన ధర్మం కోసం మాట్లాడినప్పుడు పెంటారావు సైకిల్‌కు ఒకవైపు జాతీయ జెండా, మరోవైపు సనాతన ధర్మం చాటుతూ జెండా కట్టి ఆల్ ఇండియా సైకిల్ యాత్ర చేసి అన్ని దేవస్థానాలను దర్శించుకోవడం జరిగింది. మరలా సోమవారం పొట్టిదొరపాలెం నుంచి సైకిల్‌పై అమరావతిలో ఉన్న పవన్ కల్యాణ్‌ను కలవడానికి బయలుదేరాడు. ఈ క్రమంలో రావికమతం, నాతవరం మండల కేంద్రాలు దాటుతుండగా ఆంధ్రజ్యోతి విలేకరులు పెంటారావును పలకరించారు. పవన్ కల్యాణ్‌ను కలసేవరకు అమరావతిలోనే ఉంటానని ఈ సందర్భంగా అతని బంధువుల ద్వారా తెలిపారు.



రావికమతం, నాతవరం రహదారుల మీదుగా అమరావతి వెళ్తున్న దివ్యాంగుడు పెంటారావు

ఉపాధ్యాయుని నాగజ్యోతికి నవ్య క్రీడాజ్యోతి బిరుదు ప్రదానం



నాగజ్యోతిని సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

రోలుగుంట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రోలుగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుని నాగజ్యోతికి లయన్స్ క్లబ్ ప్రతినిధులు నవ్య క్రీడాజ్యోతి బిరుదును ప్రదానం చేశారు. గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా నర్సీపట్నం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాగజ్యోతికి ఈ బిరుదు ప్రదానం చేశారు. విద్యారంగంలోను, క్రీడా రంగంలోనూ నాగజ్యోతి విశేష సేవలు అందిస్తున్నారని, మంచి ప్రతిభను కనబరిచి క్రీడారంగంలో జాతీయ స్థాయిలో అనేక అవార్డులను సాధించారని ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. క్లబ్ చైర్మన్ సన్యాసిపాత్రుడ, సభ్యులు గొలుసు శ్రీరామమూర్తి, సుతాపల్లి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో లేగదూడల ప్రదర్శన

నర్సీపట్నం అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమలాపురం గ్రామంలో సోమవారం పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకుడు రాంబాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రతీ లేగదూడకు నట్టల నివారణ మందులు వేశారు. అలాగే పాడిరైతులకు మినరల్ మిక్చర్, బహుమతులను అందించారు. అనంతరం ఏడీ మాట్లాడుతూ రాయితీపై అందించే లింగ నిర్ధారణ వీర్యంను రైతులు వినియోగించుకోవాలన్నారు. అలాగే పశు కిసాన్ కార్డులు, పశుగ్రాస క్షేత్రాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 54 పశువులకు గర్భకోశ చికిత్సలు, 72 దూడలకు నట్టల నివారణ మందులను అందించారు. సర్పంచ్ శెట్టి శ్రీను, మాజీ సర్పంచ్ లచ్చాపాత్రుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరిల్ పంపిణీ

నర్సీపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అల్లాడ చారిటబుల్ ట్రస్ట్ పదో తరగతి విద్యార్థుల కోసం సమకూర్చిన బయాలజీ స్టడీ మెటీరియల్ పుస్తకాలను కౌన్సిలర్లు చింతకాయల పద్మావతి, రాజేశ్ చేతుల మీదుగా ఉపాధ్యాయులకు అందజేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు ప్రతీ హైస్కూల్‌కి నాలుగు పుస్తకాలు చొప్పున సుమారు 200 పుస్తకాలను ట్రస్ట్ ప్రతినిధి సురేశ్ ఆర్థిక సాయంతో అందజేశారు. బయాలజీ సబ్జెక్టుకు సంబంధించి ఎస్ఈఆర్టీ రూపొందించిన ప్రశ్నలకు సమాధానాలు ఈ మెటీరియల్‌లో ఉంటాయని, విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు తెలిపారు.

ఇంటర్వ్యూ..

ఆరోగ్య సేవలు విస్తృతపరుస్తాం

-ఎన్.హరిప్రవీణ్, వైద్యాధికారి



ఏజెన్సీ ముఖ ద్వారమైన కృష్ణాదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సీహెచ్‌సీగా మార్చితే గిరిజన, మైదాన ప్రాంతాల రోగులకు మెరుగైన సేవలు అందించవచ్చు. ఇప్పటికే ప్రతిపాదనలు చేసినప్పటికీ జిల్లా విభజన వల్ల అమలుకు నోచుకోలేదు. పీహెచ్‌సీ పరిధిలో ఆరోగ్య సేవలను విస్తృతపరుస్తాం.

ప్రశ్న: పీహెచ్‌సీ పరిధిలో రోజూ ఎంత మంది రోగులు సేవలు అందుతున్నాయి.

జవాబు: రోజుకు సుమారు వంద మందికిపైగా, సోమవారం వారపు సంత రోజు 200 మందికిపైగా వైద్య సేవలు పొందుతున్నారు.

ప్రశ్న: పీహెచ్‌సీలో ఎటువంటి అదనపు సేవలు అవసరం ?

జ: రోగులు అధికంగా వస్తుండడంతో పీహెచ్‌సీలో త్వరగా మందులు అయిపోతున్నాయి. దీంతో మందులకు బడ్జెట్ పెంచితే రోగులకు మరింతగా వైద్య సేవలు అందుతాయి.

ప్రశ్న: మలేరియా/డెంగ్యూ జ్వరాలు ప్రబలకుండా ఎటువంటి జాగత్తలు తీసుకుంటున్నారు?

జ: మలేరియా/డెంగ్యూ జ్వరాలు రాకుండా నెలలో ప్రతీ శుక్రవారం డ్రైడే-ఫ్రైడే అనే ప్రోగ్రామ్ సిబ్బందితో నిర్వహిస్తున్నాం. మురుగు నిల్వ ఉన్న నీటి కుంటలు గుర్తించి సచివాలయ కార్యదర్శికి తెలుపుతాం. దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నాయి. అయితేప దోమలు కుట్టకుండా అందరికీ దోమ తెరలు పంపిణీ చేస్తే బాగుంటుంది.

ప్రశ్న: రోగులకు వసతి, సౌకర్యాలు సరిపోతున్నాయా?

జ: కచ్చితంగా సరిపోలేదు. పీహెచ్‌సీని 30 పడకల సీహెచ్‌సీగా మార్చాలని ఉన్నతాధికారులు ప్రతిపాదన చేశారు. జిల్లాల విభజన కారణంగా ఇది అమలకు నోచుకోలేదు. ఈ విషయమై జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరుకుంటున్నాం.

ప్రశ్న: పీహెచ్‌సీలో రాత్రులు విధులు నిర్వహించే సిబ్బందికి భద్రత ఉంటుందా?

జ: ఊరు శివారులో పీహెచ్‌సీ ఉండడంతో రాత్రి సమయంలో స్టాఫ్ నర్సులు/క్లాస్ ఫోర్ సిబ్బంది (ఎఫ్ఎన్‌వో) డ్యూటీలో ఉన్నప్పుడు చాలా ఇబ్బందులు గురవుతున్నారు. దీని పట్ల ఆలోచిస్తూ నైట్ వాచ్‌మేన్/సెక్యూరిటీ గార్డు పోస్టు భర్తీ చేస్తే బాగుంటుంది. లేనిపక్షంలో అసంపూర్తిగా వదిలేసిన పీహెచ్‌సీలో ప్రహరీ గోడ పూర్తిచేసి, ప్రవేశ గ్రేట్ ఏర్పాటు చేస్తే కొంత వరకు రక్షణగా ఉంటుంది.

-కృష్ణాదేవిపేట, ఆంధ్రజ్యోతి

డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా రేపు

చోడవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కిరణ్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ జాబ్‌మేళాలో వివిధ కంపెనీలు పాల్గొంటున్నాయని చెప్పారు. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9494791935 నంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

31న దేవరాపల్లిలో జాబ్‌మేళా

దేవరాపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 31న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో జరగనున్న ఈ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యుడు మొల్లి కృష్ణమూర్తి, నాయకులు గుల్లిపల్లి మురళీ, ఎల్.సత్యనారాయణ పాల్గొన్నారు.

8 నుంచి ఉమామహేశ్వరీదేవీ తీర్థ మహోత్సవాలు

దేవరాపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వచ్చే నెల 8వ తేదీ నుంచి ఉమామహేశ్వరీదేవీ కల్యాణ తీర్థ మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు సమావేశమయ్యారు. ఐదు రోజుల పాటు ఉత్సవాల నిర్వహణకు అవసరమయ్యే ఏర్పాట్లు ఇప్పట్నుంచే చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితాప్రసాద్, సభ్యులు ఎల్లేటి కరుణాకరరావు, గుండు రాంబాబు, ఇట్లా వెంకటపతి, వెత్సారమేష, దీవిశంకరు, పరవాడ రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు పశు వైద్య శిబిరం

దేవరాపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) మండలంలోని చిననందిపల్లి గ్రామంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహిస్తామని పశు వైద్యాధికారి మంజుషారాణి తెలిపారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

జాతీయ విలువిద్య పోటీలకు దేశయ్య ఎంపిక



ఎస్.దేశయ్యను అభినందిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది

విశాఖపట్నం స్పోర్ట్స్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ జూనియర్ విలువిద్య చాంపియన్‌షిప్ పోటీలకు అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎస్.దేశయ్య ఎంపికయ్యాడు. విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ టోర్నీలో ఉమ్మడి విశాఖ జిల్లాకు ప్రాతినిధ్యం వహించి అద్భుతమైన ఆటతీరుతో రజత పతకం సాధించాడు. ఈ టోర్నీ ఇండియన్ రౌండ్ ఈవెంట్‌లో దేశయ్య 645 పాయింట్లు సాధించి జాతీయ టోర్నీకి అర్హత సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ తన కార్యాలయంలో దేశయ్యను అభినందించి జాతీయ టోర్నీలోనూ పతకం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పుష్పరాజు, స్పోర్ట్స్ ఇన్‌చార్జి పి.నాగబాబు, ఫిజికల్ డైరెక్టర్ ఎస్.అప్పారావు, వై.వి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు పతకం అందించిన నేపథ్యంలో జిల్లా ఆర్చరీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.సూర్యనారాయణరెడ్డి, కె.నిశాంత్, సీనియర్ ఉపాధ్యక్షుడు పి.సత్యనారాయణ, ఇతర ప్రతినిధులు హర్షం ప్రకటించారు.

యంత్రాలతో వరి నూర్పులు

- జిల్లాలో పెరుగుతున్న యాంత్రీకరణ
- సమయం, కూలి ఖర్చులు ఆదా
- కంబైన్ హార్వెస్టర్‌తో మరింత మేలంటున్న ఆర్‌ఏఆర్ఎస్ శాస్త్రవేత్త

అనకాపల్లి అగ్రికల్చర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరి సాగు, పంట నూర్పుల్లో యాంత్రీకరణకు రైతులు ప్రాధాన్యం ఇస్తున్నారు. కూలీల కొరతతో పాటు కూలి రేట్లు పెరిగిపోవడంతో రైతులు వరి నూర్పులను యంత్రాలను వినియోగిస్తున్నారు. వరి నూర్పే యంత్రాలు (త్రెషర్లు) స్థానికంగానే అద్దెకు లభిస్తుండడంతో ఎక్కువ మంది రైతులు వీటికి మొగ్గు చూపుతున్నారు. కూలీలతో పోలిస్తే పనులు త్వరగా అవుతుండడం మరో కారణంగా చెప్పాలి.

ఉత్తరాంధ్రలో అనకాపల్లి జిల్లాతో పోలిస్తే శ్రీకాకుళం జిల్లా రైతులు కంబైన్ హార్వెస్టర్‌లను అధికంగా వినియోగిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో వరి కోతలు ముందుగానే పూర్తవుతుంటాయి. దీంతో ఇక్కడి యజమానులు కంబైన్ హార్వెస్టర్లను ఖాళీగా ఉంచకుండా శ్రీకాకుళం జిల్లాకు తరలించి అక్కడ రైతులకు అద్దెకు ఇస్తున్నారు. ఈ క్రమంలో అనకాపల్లి జిల్లాలో జాతీయ రహదారి పక్కనున్న మండలాల రైతులు వీటిని అద్దెకు తీసుకొని వినియోగించుకుంటున్నారు.

అయితే కంబైన్ హార్వెస్టర్‌తో వరి పంట కోత, నూర్పిడి, ధాన్యం తూర్పార పనులు ఒకేసారి జరుగుతుంటాయి. ఈ క్రమంలో ఎండు గడ్డి లభించదు. చిన్నపాటి ముక్కలుగానే పొలంలో పడిపోతుంది. జిల్లా రైతుల్లో ఎక్కువ మంది ఎండ గడ్డిని పశువుల మేతగా వినియోగిస్తుంటారు. అందువల్ల కంబైన్ హార్వెస్టర్ల కన్నా కోత కోసిన తరువాత పంట నూర్పే యంత్రాలను (త్రెషర్లు) మాత్రమే ఉపయోగించడానికి జిల్లా రైతులు ప్రాధాన్యం ఇస్తున్నారు. వీటి ధర రూ.2 లక్షలు మాత్రమే వుండడంతో ఒకింత ఆర్థిక స్థోమత వున్న రైతులు సొంతంగా దీనిని కొనుగోలు చేసుకుని, అద్దెకు కూడా ఇస్తున్నారు. గంటకు వెయ్యి రూపాయలు మాత్రమే అద్దె కావడంతో రైతులు ట్రాక్టర్లు, పశువులతో వరి నూర్పులు చేయడం లేదు. యంత్రంలో వరి పనలు వేయడానికి, నూర్చిన తరువాత చెత్తను కుప్ప పెట్టడానికి, ధాన్యాన్ని గోనె సంచుల్లోకి నింపడానికి ముగ్గురు మగ కూలీలు వుంటే సరిపోతుంది. గంటకు సుమారు అర ఎకరా విస్తీర్ణంలో పండి వరి పంటను ఈ యంత్రం నూరుస్తుంది. ఇవే పనులను ట్రాక్టర్లతో నిర్వహిస్తే రెట్టింపు ఖర్చు అవుతుందని, అధిక సమయం కూడా పడుతుందని రైతులు చెబుతున్నారు. అంతేకాక కూలీల కొరత ఉన్నందున యంత్రాలనే వినియోగిస్తున్నామని అంటున్నారు.



యంత్రంతో వరి పైరును నూర్పుతున్న రైతులు

కంబైన్ హార్వెస్టర్లతో అధిక ప్రయోజనం

- కేవీరమణమూర్తి, సేద్య విభాగం ప్రధాన శాస్త్రవేత్త, అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్

కంబైన్ హార్వెస్టర్‌లతో వరికోత, నూర్పు, ధాన్యం శుభ్రం చేసి బస్తాలకెత్తడం వంటి పనులు చేస్తే 60 శాతం ఖర్చులు ఆదా అవుతాయి. వరి పైరు వర్షాలకు తడిసి, గాలులకు పడిపోయిన పరిస్థితుల్లో వరికోత, నూర్పులకు కంబైన్ హార్వెస్టర్‌లను వినియోగించడం వల్ల పంట నష్టాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చు. వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల ఏటా పంటకోత సమయంలో భారీ వర్షాలు, తుపాన్లు సంభవిస్తున్నందున కంబైన్ హార్వెస్టర్‌ల వినియోగం మంచిది. గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతాల్లో 80 శాతం వరి పంటను కంబైన్ హార్వెస్టర్లతోనే కోసి నూర్పుతున్నారు.గంట సమయంలో ఎకరా విస్తీర్ణంలో వరిని కోసి, నూర్చి, ధాన్యం శుభ్రం చేస్తుంది. దీనివల్ల సమయంతోపాటు 60 శాతం ఖర్చు ఆదా అవుతాయి.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి



మన్నెం రవి (ఫైల్ ఫొటో)

కూర్మన్నపాలెం, (విశాఖపట్నం), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన మన్నెం రవి (56)సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఇక్కడి ముస్తఫా జంక్షన్‌లో నివాసం ఉంటున్న ఆయన ఇంటి నుంచి విధుల నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మార్గమధ్యంలో గుండెపోటు రావడంతో రోడ్డు పక్కల వాహనాన్ని ఆపారు. దీంతో స్థానికులు హెచ్‌సీ కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో పాటు అగనంపూడి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రవి మృతి చెందారు. 1991 బ్యాచ్‌కు చెందిన ఇతను ఇటీవల బదిలీపై దువ్వాడ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. పోలీసు అధికారులు వచ్చి నివాళులు అర్పించారు. అనంతరం మృతదేహాన్ని పాయకరావుపేట తరలించారు.

అధిక లోడుతో వస్తున్న ఆరు లారీలు సీజ్

మాకవరపాలెం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలో అధిక లోడుతో వస్తున్న ఆరు లారీలను ఆదివారం రాత్రి సీజ్ చేసినట్టు నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని రాచపల్లి వద్ద ఉన్న అల్యూమినియం(పయనీర్)కంపెనీకి విశాఖపట్నం గంగవరం పోర్టు నుంచి లారీలతో బాక్సైట్ ఖనిజం తీసుకొని రోజూ అధిక సంఖ్యలో లారీలు వస్తుంటాయి. దీంతో తాళ్లపాలెం నుంచి మాకవరపాలెం వరకు ఉన్న రోడ్డు మరమ్మతులకు గురవుతున్నదని పలుమార్లు స్థానికులు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. దీంతో సోమవారం ఆరు లారీలను డీఎస్పీ సీజ్ చేశారు. తదుపరి చర్యల నిమిత్తం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించారు.

కొట్లాట కేసులో ఇరువర్గాలపై కేసు నమోదు

మాకవరపాలెం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పైడిపాల గ్రామంలో జరిగిన కొట్లాటకు సంబంధించి ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ దామోదరనాయుడు తెలిపారు. మండలంలోని పైడిపాలలో కసిపల్లి శివాజీ, పురం లోవరాజు కుటుంబాల వారు ఆదివారం సాయంత్రం డ్వాక్రా సంఘం డబ్బులు పంపకాల విషయంలో గొడవ పడి కత్తులతో దాడులు చేసుకున్నారు. కసిపల్లి శివాజీ, కసిపల్లి అభి, కసిపల్లి ఏసురత్నం కలిసి కత్తితో దాడి చేయడంతో పురం లోవరాజు తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే లోవరాజుతో పాటు మరికొందరు కలిసి ఎదురు దాడి చేయడంతో కసిపల్లి శివాజీకి కూడా గాయాలయ్యాయి. ఉభయవర్గాలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

దివ్యాంగుడి అదృశ్యంపై ఫిర్యాదు



అప్పల నాయుడు(ఫైల్)

దేవరాపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఓ దివ్యాంగుడి అదృశ్యంపై స్థానిక పోలీసులకు సోమవారం ఫిర్యాదు అందింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఏ.కొత్తపల్లి గ్రామానికి చెందిన కర్రి మాత అప్పలనాయుడు(32) అనే దివ్యాంగుడు నాలుగు నెలల నుంచి కనిపించడం లేదని అతని తమ్ముడు నూకరాజు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ టి.మల్లేశ్వరరావు తెలిపారు.

లారీ ఢీకొని ప్రైవేటు సెక్యూరిటీ గార్డు మృతి

రాంబిల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్ఏఓబీ గేటు వద్ద సోమవారం ఉదయం లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. ఎస్ఐ నాగేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాలోని కేదార్‌పూర్‌కు చెందిన ప్రహ్లాద్ పాణిగ్రహి (29) ఎన్ఏఓబీలో ఒక ప్రైవేటు ఏజెన్సీ తరపున సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా సోమవారం ఉదయం నొక లారీని తనిఖీ చేసి కిందకు దిగుతుండగా, పక్క నుంచి వెళుతున్న మరో లారీ ఢీకొన్నది. దీంతో పాణిగ్రహి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సదరు సెక్యూరిటీ ఏజెన్సీ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

47 కేసుల మద్యం, బీరు పట్టివేత



ఆటోలో మద్యం కేసులు

ఎస్.రాయవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపతిరాజుపేట జంక్షన్ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న మద్యం, బీరు సీసాలను పోలీసులు పట్టుకున్నారు. సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అడ్డరోడ్డు నుంచి రేవుపోలవరం వైపు ఆటోలో మద్యం కేసులు తరలిస్తుండడాన్ని గమనించిన గుర్రం నానాజీ అనే వ్యక్తి... ఆటోను ఆపి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు వెళ్లి ఆటో డ్రైవర్ స్వామిని అదుపులోకి తీసుకున్నారు. ఆటో వున్న 47 మద్యం కేసులను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 26 కేసుల్లో 373 బీరు సీసాలు, 21 కేసుల్లో 1,008 మద్యం సీసాలు వున్నట్టు నిర్ధారిం చారు. అక్రమ మద్యం తరలిస్తున్న ఆటోలో వున్న మరో ఇద్దరు పరారయ్యారు. మద్యంతోపాటు ఆటోను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు.

బాలిక కిడ్నాప్ కేసులో మరొకరి అరెస్టు

- 23 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

సబ్బవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీవీఎంసీ పరిధిలో వున్న ఒక గ్రామంలో బాలికను కిడ్నాప్ చేసిన కేసులో మరో నిందితుడి మాటూరి సాయికుమార్‌ను సోమవారం పోలీసులు ఇక్కడ అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.15 లక్షల విలువ చేసే 23 తులాల బంగారు అభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ సోమవారం ఇక్కడ పోలీసు స్టేషన్‌లో మీడియా సమావేశం ఏర్పాటుచేసి వివరాలను వెల్లడించారు. జీవీఎంసీ పరిధిలోని ఒక గ్రామానికి చెందిన బాలికను గత ఏడాది అక్టోబరు 19వ తేదీన విజయనగరం సాలిపేటకు చెందిన పతివాడ మహేశ్ అనే వ్యక్తి అపహరించుకుపోయాడు. అదే నెల 21వ తేదీన బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ నెల 10వ తేదీన మహేశ్.. బాలికను ఆమె ఇంటి వద్ద వదిలిపెట్టి పారిపోతుండగా అనకపల్లి వద్ద పట్టుకుని అరెస్టు చేశారు. బాలిక కిడ్నాప్ నకు మాటూరి సాయికుమార్ సహకరించినట్టు విచారణలో వెల్లడికావడంతో పోలీసులు అతనిపైనా కేసు నమోదు చేశారు. బాలికను కిడ్నాప్ చేసే క్రమంలో ఆమె ఇంటిలో నుంచి 23 తులాల బంగారు ఆభరణాలను సాయి కుమార్ తస్కరించినట్టు గుర్తించారు. అప్పటి నుంచి పరారీలో వున్న ఇతనిని పోలీసులు సోమవారం సాయంత్రం సబ్బవరంలో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 23 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. సాయికుమార్ పై గతంలో ఇనుము దొంగతనం, పోక్సో కేసు నమోదై ఉన్నాయని డీఎస్పీ చెప్పారు. విలేకరుల సమావేశంలో సీఐ పిన్నింటి రమణ, సిబ్బంది వున్నారు.

పాల సేకరణలో కోత

... 5వ పేజీ తరువాయి

తగ్గకుండా పాలను సరఫరా చేస్తుంటారు. విశాఖ డెయిరీ విధించిన కొత్త నిబంధన కారణంగా రెండు లీటర్ల పాలు వృథా అయ్యే పరిస్థితి ఏర్పడింది. ఒక్కో పాల సంఘంలో రోజుకి కనీసం 80 లీటర్లు, గరిష్ఠంగా 500 లీటర్ల వరకు పాల సేకరణ తగ్గిపోతుంది. వ్యవసాయం అంత లాభసాటిగా లేకపోవడం వల్ల చాలామంది అప్పులు చేసి పాడి పశువులు కొనుగోలు చేశారు. కొంతమంది రైతులు విశాఖ డెయిరీని నమ్ముకొని బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకొని పది నుంచి 20 వరకు పశువులతో మినీ డెయిరీలు నడుపుతున్నారు. ఇప్పుడు పాల సేకరణ తగ్గిస్తే తాము తీవ్రంగా నష్టపోతామ ని ఆయా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పర్యాటక హబ్‌గా విశాఖ

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి విశాఖపట్నమే రియల్ హబ్ (నిజమైన కేంద్రం)గా నిలుస్తుందని, ఆ విధంగా అభివృద్ధి చేస్తామని ఆ శాఖా మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. నోవాటెల్‌లో సోమవారం నిర్వహించిన ప్రాంతీయ పర్యాటక పెట్టుబడిదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లు పర్యాటక రంగం గతి తప్పిందన్నారు. తాము ఆరు నెలల పనికూనలమని, తోడ్పాటు అందిస్తే పర్యాటక అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ఈ రంగాన్ని పీ-4 విధానంలో అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షిస్తున్నారన్నారు. పై స్థాయి నుంచి ఆదేశాలు ఇవ్వకుండా, క్షేత్ర స్థాయి నుంచి సూచనలు తీసుకొని పనిచేయాలని నిర్ణయించామని, అంతా కలిసి ముందుకు రావాలన్నారు. విశాఖను క్రూయిజ్ హబ్‌గా మారుస్తామన్నారు. పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ మాట్లాడుతూ, సోషల్ మీడియా ద్వారా పర్యాటక ప్రచారం జరగాలని, ఆ దిశగా చర్యలు చేపడతామన్నారు. వాటర్ స్పోర్ట్స్, అడ్వంచర్ స్పోర్ట్స్‌కు పెద్దఎత్తున సహకారం అందుతుందన్నారు. ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ, పర్యాటకులకు గతంలో తిరుపతి పుణ్యక్షేత్రంలో శీఘ్ర దర్శనం చేయించేవారమని, పత్రికల్లో వ్యతిరేక వార్తలు రావడంతో ప్రభుత్వం ఆ సదుపాయం తీసేసిందని, దీనికి మంచి ఆదరణ ఉన్నందున మళ్లీ పునరుద్ధరించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. యారాడ అందమైన బీచ్ అని దానిని కూడా అభివృద్ధి చేస్తామన్నారు.

400 కి.మీ. 30 బీచ్‌లు అభివృద్ధి

ఏపీటీడీసీ ఎండీ అండ్ వీసీ ఆమ్రపాలి మాట్లాడుతూ కోస్తాలో 400 కి.మీ. పొడవైన సముద్ర తీరంలో 30 కొత్త బీచ్‌లను అభివృద్ధి చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. పర్యాటక ప్రాజెక్టులకు భూముల కేటాయింపులపై రెండు వారాల్లో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. విశాఖ, కాకినాడ నగరాలను లీజర్ హబ్‌లుగా గుర్తించి, అభివృద్ధి చేయనున్నామన్నారు. రాయపూర్, కోల్‌కతా, భువనేశ్వర్ ప్రాంతీయులకు వెడ్డింగ్ డెస్టినేషన్‌గా ఏపీని అభివృద్ధి చేస్తామన్నారు. సుస్థిర పర్యాటకంపైనే దృష్టి పెడుతున్నామన్నారు. ప్రభుత్వం తరపున పోర్టల్ పెడుతున్నామని, ప్రతి ఒక్కరూ రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

తంతడి, సీతపాలెంలలో బీచ్ ఫ్రంట్‌లు

అనకాపల్లి కలెక్టర్ విజయ్ కృష్ణన్ మాట్లాడుతూ తమ జిల్లాలో తంతడి, సీతపాలెం బీచ్‌లు ఉన్నాయని, అక్కడ రిసార్ట్స్ అభివృద్ధి చేయడానికి పెట్టుబడిదారులు ముందుకు రావాలన్నారు. జిల్లాలో పరిశ్రమలు అధికంగా ఉన్నాయని, 1.5 లక్షల మంది కార్మికులు ఉన్నారని, వారికి ఆరోగ్య వైద్య సేవలు అందించేందుకు వైద్య రంగం ద్వారా పెట్టుబడులు పెట్టాలన్నారు. సుమారు 80 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని, ఆసక్తితో ముందుకు వస్తే అనుమతులు ఇస్తామన్నారు.

కాలుష్య కోరల్లో మామిడిపాలెం

... 5వ పేజీ తరువాయి

జరుపుతుంటారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున దుమ్ము, ధూళి ఎగిసి, నివాసాలపైకి వస్తున్నది. ఇక స్టోన్ క్రషర్ల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. క్వారీల్లో పేలుళ్ల సమయంలోనే దుమ్ము ఎగిసిపడుతుంటుంది. కానీ స్టోన్ క్రషర్లు ఆడుతున్నంత సేపు దుమ్ము, ధూళి పెద్ద ఎత్తున ఎగుస్తుంటుంది. ఇళ్లు, పొలాలు, తోటలు, ఖాళీ స్థలాలు... ఎక్కడ చూసినా తెల్లటి బూడిద పేరుకుపోయి కనిపిస్తుంది. దుమ్ము, ధూళితో నిండిన గాలిని పీల్చడం, కలుషితమైన భూగర్భ జలాలను తాగడం వల్ల ప్రజలు శ్వాసకోశ, కిడ్నీ సంబంధ వ్యాధులబారిన పడుతున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా మారుతుండడంతో ప్రాణాలు కోల్పోతున్నారు. క్వారీలు, క్రషర్ల నిర్వాహకులు నిబంధనలను గాలికొదిలేస్తున్నప్పటికీ సంబంధింత అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని మామిడిపాలెం గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గత నాలుగేళ్లలో కిడ్నీ సంబంధ వ్యాధులతో 25 మంది మృతిచెందారు.

1,421 మందిలో 300 మంది కిడ్నీ వ్యాధి బాధితులు

అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ఆర్థిక సహాయంతో ఇటీవల గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రైవేటు వైద్య శిబిరంలో 1,421 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వీరిలో 300 మంది కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్టు వైద్యులు నిర్ధారించారు. ఇంకా పలువురు శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. గ్రామంలో మిగిలిన వారికి కూడా వైద్యపరీక్షలు నిర్వహిస్తే మరింత మంది బాధితులు వుంటారని అంటున్నారు. వైద్య శిబిరంలో కిడ్నీ వ్యాధిబారిన పడినట్టు తెలుసుకున్న పలువురు.. వైద్య సేవల కోసం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వెళుతున్నారు. పరిస్థితి ముదరడంతో పూడి రాము, జెర్రిపోతుల శ్రీను, సాలాపు సన్యాసిరావు, ముమ్మిడి మహేష్ డయాలసిస్ చేయించుకుంటున్నారు.

కిడ్నీ వ్యాధితో మృతిచెందిన వారు..

గోరపల్లి సత్యారావు, వుప్పులూరి అప్పారావు, కోరుకొండ అప్పారావు, జబ్బాక పడమటమ్మ, పడాల పరదేశమ్మ, సాలాపు రాములమ్మ, కరణం భారతి, చిన్ని రమణ, బోగాది అప్పారావు, పూడి సత్యవతి, జబ్బాక బాలాజీ, బొబ్బర వెంకటరావు, దాడి భూలక్ష్మి, చిన్ని రాములమ్మ, మునగపాక జగాప్ప, కోరుకొండ అబ్బాయి, కోరుకొండ రాము, గన్ను దేముడు, మోసూరి మారిబాబు, కోరుకొండ నాయుడు, బొగాది లక్ష్మణమ్మ, మేడిశెట్టి ఎరుకునాయుడు, ఉప్పులూరి అప్పారావు, అట్టా సురేష్, కోరుకొండ బాబురావు, కోరుకొండ లక్ష్మి.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

ఎలమంచిలి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో నిందితుడిని పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, పట్టణ ఎస్ఐ సావిత్రి వివరాలను వెల్లడించారు. పట్టణంలోని ఒక పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న 13 ఏళ్ల బాలికను ఉలకపేటకు చెందిన హాకీ క్రీడాకారుడు మళ్ల రూపేష్ అనే యువకుడు బెదిరించి, భయపెట్టి అత్యాచారం చేశాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లి.. ఆదివారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

కోటవురట్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రిక్షా కార్మికుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు సంబంధించి ఎస్ఐ రమేశ్ అందజేసిన వివరాలిలా ఉన్నాయి. కోటవురట్ల శివారు రాట్నాలపాలెం గ్రామానికి చెందిన బుంగా అప్పారావు(50) మండల కేంద్రంలో రిక్షాతొక్కుతూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన ఇతనిని సోమవారం భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. అనంతరం రిక్షా వద్దకు వచ్చి పడుకున్నాడు. కొంతసేపటి తరువాత ఇక్కడకు వచ్చిన కుమారుడు.. అప్పారావును తట్టి లేపడానికి ప్రయత్నించాడు. కానీ లేవకపోవడంతో ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య వీరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	495
విజయనగరం	499
శ్రీకాకుళం	499

వీవోఏలు రిలే నిరాహారదీక్ష

... 5వ పేజీ తరువాయి

సీహెచ్.రూపాదేవి, జిల్లా గౌరవాధ్యక్షుడు వి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆరు నెలల నుంచి గౌరవ వేతనం ఇవ్వకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మొబైల్ ఫోన్లకు రీచార్జి చేసుకునేందుకు కూడా చేతిలో డబ్బులు లేవని వాపోయారు. డిసెంబరు 16న సెర్ప్ సీఈవో, యూనియన్ నాయకులతో జరిపిన చర్చల్లో సంక్రాంతి పండుగ లోపు వేతనాలు చెల్లిస్తామని చెప్పారని, కానీ అమలుచేయలేదన్నారు. అంతేకా వీవోఏలు మూడు సంవత్సరాలు మాత్రమే వుండాలన్న కాల పరిమితి సర్క్యులర్ వల్ల ఎంతో ఉపాధి కోల్పోయి రోడ్డున పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ నెలాఖరులోగా సమస్యలు పరిష్కారం కాకపోతే ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి పనులు నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి కె.లక్ష్మీ ప్రసన్న, నాయకులు వై.లక్ష్మి, అప్పలనాయుడు, రమణ, మాణిక్యం, భవానీ, రమణమ్మ, లావణ్య, జగదీశ్వరి, లక్ష్మి, డి.రమేశ్ పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

... 5వ పేజీ తరువాయి

నుంచి పలువురు వివిధ పనులపై సోమవారం మండల కేంద్రానికి వచ్చారు. చీకటి పడిన తరువాత తట్టబంద మెయిన్ రోడ్డు బస్టాప్, ఆంధ్రా బ్యాంకు, గ్రామీణ వికాస బ్యాంకు సమీపంలో జన సంచారం అధికంగా వుంది. ఈ సమయంలో పిచ్చికుక్క ఒకటి జనంపై దాడి చేసింది. మొరుగుతూ ఎడాపెడా కరిచేసింది. దీంతో జనం తలో దిక్కుకు పరుగులు తీశారు. అప్పటికే పలువురిని కరిచిన కుక్క.. మేడివాడ వెళ్లి అక్కడ మరో ముగ్గురిని కరచి గాయపరిచింది. పిచ్చికుక్క దాడిలో టి.అప్పారావు, కె.ఇసీకా, ఎం.వరహాలు, జి.నర్సింహులు, సిహెచ్.హరిత, కె.పోతురాజు, ఆర్.రాజులమ్మ, ఎ.అప్పారావు, ఎస్.కుమార్, వి.దానకర్ణి, జి.అన్నపూర్ణమ్మ, ఎన్.కన్నంనాయుడు, పి.కృష్ణ, పి.శ్రీను, జె.నారాయణమూర్తి, శెట్టి శ్రీను, గొర్లె రామకృష్ణ, డి.కుమార్, ఎస్.శ్రీనివాస్, ఎ.అజయ్, పి.అచ్యుతారావుకు గాయపడ్డారు. వీరంతా స్థానిక పీహెచ్‌సీకి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. వీరిలో కె.ఇసీకా, జి.రామకృష్ణ, అప్పారావుల పరిస్థితి ఆందోళనకరంగా వుండడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.